సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
మంగళవారం, 14.04.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 172
పేజీలు: 12 వెల: రూ. 5

## హర్మూజ్ జలసంధి టూ
# విజయనగర సామ్రాజ్యం
### శ్రీకృష్ణదేవరాయల అముక్తమాల్యదలో హర్మూజ్ ప్రస్తావన


వెలుగులోకి చారిత్రక బంధం!
విజయనగర కాలంలో హర్మూజ్ ద్వారా విస్తరించిన సముద్ర వాణిజ్యం

04




- శ్రీనాథుడి సాహిత్యంలో హురుమాంజిగా ప్రస్తావన
- ఇరాన్ నుంచి గుర్రాలు, ఎండుఫలాల దిగుమతిలో కీలక పాత్ర
- కాకతీయుల నుంచి రాయలవారి వరకు కొనసాగిన సముద్ర మార్గాలు

## భర్త రక్తమాంసాలను లాక్కోవడమే..
భరణం కేసులో మధ్యప్రదేశ్ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు



- లక్ష జీతం ఉన్నా భరణం కావాలా?
- భరణం అంటే విలాసం కాదు.. అవసరం..
- స్వయం సంపాదన గల మహిళ పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు

10

## శ్రీపాదరావు స్ఫూర్తితో పనిచేస్తాం..
- శ్రీ పాదరావు విగ్రహావిష్కరణ చేయడం సంతోషం..
- కరీంనగర్ లో కాంగ్రెస్ నేతల ఘనంగా నివాళులు..
- సుడా చైర్మన్ ఆధ్వర్యంలో అన్నదానం
- శ్రీపాద రావు బాటలో నడుస్తాం : కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి
- తండ్రి ఆశయ సాధన కోసం నిరంతరం శ్రమిస్తున్న మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు: మాజీ ఎమ్మెల్యే మృత్యుంజయం

03

శ్రీపాదరావు వర్ధంతిలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



## ప్రతిపాదనలు రాజ్యాంగ విరుద్ధం
- ఆదాయం ఆధారంగా సీట్లు ఇవ్వాలనడం తప్పు
- వెనుకబడిన జిల్లాలకు న్యాయం చేయాలన్నదే బీజేపీ వాదన
- అంబేద్కర్ రాజ్యాంగ పునాదులను దెబ్బతీసే ప్రయత్నమని కాంగ్రెస్‌పై ఆరోపణలు
- మహిళా రిజర్వేషన్లపై కాంగ్రెస్ వైఖరిని తప్పుబట్టిన బండి

డీలిమిటేషన్ పై రేవంత్ తీరు సరికాదు.. కేంద్రమంత్రి బండి సంజయ్

09



## మంత్రి సీతక్క వర్సెస్ కేసీఆర్
లీగల్ ఫైట్‌కు తెర




- క్షమాపణ చెప్పాలని కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసులు
- అంగన్ వాడీల సెల్ ఫోన్ల అంశంపై సీరియస్
- 48 గంటల్లో పోస్టులు తొలగించండి.. లేదంటే కోర్టుకే వెళ్తే హెచ్చరిక
- ఫోన్ల కొనుగోళ్లలో అవినీతి లేదన్న సీతక్క..


03

## టెట్ నోటిఫికేషన్ రిలీజ్
09

జూన్ లో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్
ఈ నెల 15 నుంచి 30 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ





## అన్నా, చెల్లి మధ్యలో
- కవిత ట్రాప్ లో కేటీఆర్
- చెల్లికి అన్న కౌంటర్లు
- తొలినాళ్లలో కొంత సహనం
- ఇప్పుడు సమాధానం
- మాట్లాడనంటూనే విమర్శలు
- పార్టీ ఏర్పాటు ముందు కవితకు బలం



# టీఆర్ఎస్
## ముదురుతున్న మాటల యుద్ధం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
కుటుంబాన్ని.. బీఆర్ఎస్ ను విభేదించిన కల్వకుంట్ల కవిత వ్యూహాలు సక్సెస్ అవుతున్నాయి. తన యుద్ధం కేటీఆర్ వర్సెస్ కవిత అన్నట్టే ఉండాలని ముందు నుంచీ ప్లాన్ చేస్తున్నారు. కానీ, కేటీఆర్ నుంచి కవిత విమర్శలకు అనుకున్నంత మేర రిప్లై రావడం లేదు. కేటీఆర్ టీం కూడా కవిత వర్గాన్ని చాలా లైట్ తీసుకుంటున్నట్లే కనిపించాయి. అప్పుడప్పుడు హరీశ్ రావు, సంతోష్‌ను టార్గెట్ చేస్తున్న కవిత.. తన ప్రధాన శత్రువు మాత్రం కేటీఆర్ అన్నట్టే వ్యవహరిస్తున్నారు. అయితే, కవిత విమర్శలకు హరీశ్ రావు, బీఆర్ఎస్ ఓ టీం నుంచి వస్తున్న రిప్లై కేటీఆర్ నుంచి రాకపోవడం కవితకు కొంత మైనస్‌గా మారుతోంది. కానీ, సుదీర్ఘ రాజకీయ సమయం తర్వాత కవిత ట్రాప్ లో కేటీఆర్ చిక్కుకున్నట్లు కని



పిస్తోంది. నిజానికి, వ్యూహాలు పన్నడంలో ముందుంటే కేటీఆర్.. తన చెల్లి కల్వకుంట్ల కవిత ఉచ్చులో చిక్కుకున్నారు. ఇప్పుడు దాని నుంచి బయటకు రాలేక.. టెన్షన్ పడుతున్నారు. బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చారో.. అప్పటి నుంచే కవిత టార్గెట్ కేటీఆర్. ఆ తర్వాత బీఆర్ఎస్ పతనం. కానీ, బీఆర్ఎస్ పతనం అంటే కవితతో సాధ్యం కాదని తేలిపోయినట్టే. కానీ, ఈ రెండు లక్ష్యాలనూ ఏకతాటిలో సాధించేలా ఆమె చెలరేగిపోతున్నారు. ఛాన్స్ దొరికిన ప్రతిసారీ ఆమె దాన్ని సంపూర్ణంగా ఉపయోగించుకుంటున్నారు. అధికార కాంగ్రెస్‌ని టార్గెట్ చేసిన ప్రతిసారీ, బీఆర్ఎస్‌ని కూడా ఉతికారేస్తున్నారు. మొదట్లో ఆమెను తక్కువ అంచనా వేసిన బీఆర్ఎస్ నేతలు.. ఇప్పుడు తన ఉచ్చులో చిక్కుకోవడంతో కవిత వ్యూహాలు ఫలిస్తున్నాయి. మిగతా 02లో

## మేం మద్దతిస్తాం
మహిళా రిజర్వేషన్‌కు ఒకే
- డీ లిమిటేషన్ కు కాదు
- ప్రధాని మోదీకి రేవంత్ లేఖ



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
మహిళా రిజర్వేషన్ల అమలును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం సరికాదని పేర్కొంటూ సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీకి సమగ్రమైన లేఖ రాశారు. మహిళా కోటాకు దేశవ్యాప్తంగా మద్దతు ఉందని, దీనిని రాష్ట్రాల వారీగా అసెంబ్లీ స్థానాల్లో తక్షణమే అమలు చేయాలని ఆయన కోరారు. అయితే, దీనిని సాకుగా చూపి జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాల పునర్విభజన చేయడం వల్ల దక్షిణాది , చిన్న రాష్ట్రాలు రాజకీయంగా తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా నియంత్రణ పాటించి అభివృద్ధి పథంలో నడుస్తున్న దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గడం వల్ల దేశ సమాఖ్య స్ఫూర్తి దెబ్బతింటుందని ముఖ్యమంత్రి హెచ్చరించారు. కేవలం జనాభా నిష్పత్తిని మాత్రమే ప్రామాణికంగా తీసుకోకుండా, అందరికీ ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయ నమూనాలను పరిశీలించాలని ఆయన సూచించారు. దేశ ప్రయోజనాలు పార్టీ ప్రయోజనాల కంటే మిన్న అని, ఏకపక్ష నిర్ణయాలు కాకుండా జాతీయ స్థాయిలో ఏకాభిప్రాయం సాధించాలని కోరారు.
ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాలకు భారీగా సీట్లు పెరిగి, దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యత తగ్గితే అది దీర్ఘకాలంలో దేశ సమగ్రతకు ముప్పుగా మారుతుందని రేవంత్ రెడ్డి తన లేఖలో విశ్లేషించారు. లోక్‌సభలో ప్రస్తుతమున్న ప్రాంతీయ సమతుల్యతను కాపాడుతూనే మార్పులు చేపట్టాలని ఆయన మిగతా 02లో

- ఆ తర్వాతే పాదయాత్ర, చేయాలి..
- పార్టీ పేరు మార్పు విషయంలో ఆలోచన చేయాలి
- కేటీఆర్ కు మంత్రి అడ్లూరి డిమాండ్

10

## పౌరుషం ఉంటే నీ చెల్లి ప్రశ్నలకు జవాబు చెప్పు



## సమ్మెపై తొందరొద్దు
ఆర్టీసీ కార్మికులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచన
- ఆర్టీసీ విలీనం, యూనియన్ అంశంపై కమిటీ వేశాం
- నివేదిక అనుగుణంగా చర్యలు తీసుకుంటాం

09




## భూ పరిపాలనకు కొత్త
# దిక్సూచి భూభారతి
చరిత్రాత్మక చట్టానికి రేపటితో ఏడాది పూర్తి
ప్రతి సర్వే నెంబర్‌కు భూధార్ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
09
70 లక్షల మంది పోర్టల్ ద్వారా లాగిన్

## మహిళా బిల్లుపై
# రాజకీయాలు వద్దు
50 శాతం పెంపుతో డీలిమిటేషన్ ప్రమాదకరం

- ఉత్తర, దక్షిణాది గ్యాప్ పెంచవద్దు
- మోదీకి సీఎం రేవంత్ విజ్ఞప్తి
- మహిళా రిజర్వేషన్లకు అడ్డు కాదు
- పునర్విభజనపై తొందర వద్దు
- కేంద్రంపై పోరాటం చేయాల్సిందే: సీఎం రేవంత్ రెడ్డి




**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో 50 శాతం దామాషా ప్రతిపాదన దేశానికి ప్రమాదకరమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ల బిల్లును ముసుగుగా వాడుకుని దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కేలా కేంద్రం డీలిమిటేషన్ ప్రక్రియను చేపడుతోందని ఆరోపించారు. కేవలం జనాభా ప్రాతిపదికన సీట్ల సంఖ్యను పెంచడం వల్ల ఉత్తరాది రాష్ట్రాలకు రాజకీయ బలం పెరుగుతుందని, అభివృద్ధిలో దూసుకుపోతున్న దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి ప్రస్తుతం ప్రచారంలో ఉన్న 50 శాతం పెంపు ఫార్ములాను తాము వ్యతిరేకిస్తున్నామని, ఈ విధానం అమలులోకి వస్తే కేరళ వంటి చిన్న రాష్ట్రాలతో పోలిస్తే ఉత్తరప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రాల సీట్ల అంతరం ఏకంగా 90కి పెరుగుతుందని గణాంకాలతో వివరించారు. ఉత్తరాది రాష్ట్రాలు పొలిటికల్ క్యాపిటల్స్ గా మారుతుంటే, దక్షిణాది రాష్ట్రాలు దేశానికి ఫైనాన్షియల్ మిగతా 09లో



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 14.04.2026
www.mudranews.in | @mudranews




## డాల్ఫిన్లు అత్యంత తెలివైన జంతువులు



మెదడు అభివృద్ధి ఎక్కువగా ఉండటంతో సమస్యలను పరిష్కరించగలవు. మనుషుల లాంటి సామాజిక ప్రవర్తనను కూడా ప్రదర్శిస్తాయి.

# అన్నా, చెల్లి మధ్యలో 'టీ'ఆర్ఎస్




(మొదటి పేజీ తరువాయి)

ఇటీవలి కాలంలో ఆ కుటుంబంలో తలెత్తిన రాజకీయ విభేదాలు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారాయి. ఒకప్పుడు ఉద్యమ ప్రస్థానంలో, అధికారంలోనూ కలిసి నడిచిన అన్నచెల్లెళ్లు కేటీఆర్, కవిత ఇప్పుడు బహిరంగంగానే విమర్శలు చేసుకునే స్థాయికి చేరడం పార్టీ శ్రేణుల్లో ఆందోళన కలిగిస్తోంది. కవిత కొత్త పార్టీ ప్రకటించడానికి సమయం దగ్గర పడటం, దానికి కేటీఆర్ స్పందించిన తీరుపై ఆ కుటుంబంలో బయటకు తెలియని రాజకీయ యుద్ధం ఏదో జరిగిందని భావిస్తున్నారు.

క్యాతనపల్లిలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టించాయి. కొత్త పార్టీలు ఎన్ని వస్తే అంత మంచిది, కానీ ప్రజలు ఓట్లు వేయాలి కదా అంటూనే, తల్లిదండ్రులను సంతోషపెట్టకపోయినా పర్వాలేదు.. కానీ వారిని ఏడిపించకూడదు అని ఆయన అన్నారు. ఇది నేరుగా కవితను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలే. కవిత తన సొంత రాజకీయ అజెండాతో, ముఖ్యంగా కేసీఆర్ నిర్మించిన పార్టీకి వ్యతిరేకంగా వెళ్లడం ద్వారా తండ్రిని మానసిక వేదనకు గురిచేస్తున్నారని కేటీఆర్ భావిస్తున్నట్లు మాటలను బట్టి అర్థమవుతోంది.

మరోవైపు, కవిత ఆవేదన మరోలా ఉంది. బీఆర్ఎస్ పార్టీలో తనకు సరైన ప్రాధాన్యత దక్కలేదని, ముఖ్యంగా లిక్కర్ స్కామ్ వివాదం తర్వాత తనను పార్టీ కార్యకలాపాలకు దూరం పెట్టారని ఆమె చెబుతూవస్తున్నారు. తాను పార్టీ కోసం ఎంతో చేశాను, కానీ కష్టకాలంలో నన్ను ఒంటరిని చేశారు అనే భావన ఆమెలో బలంగా ఉంది. అందుకే, తన ఉనికిని చాటుకోవడానికి, తన రాజకీయ భవిష్యత్తును వెతుక్కోవడానికి TRS పేరుతో కొత్త ప్రయాణాన్ని ఆమె ఎంచుకున్నట్లు తెలుస్తోంది.

### పార్టీ పేరు టీఆర్ఎస్ అంటూ సవాల్

తాజాగా ఓ సందర్భంలో కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. "మీ పార్టీ పేరు ఏం పెట్టాలనుకుంటున్నారనే ప్రశ్నకు కవిత ఆసక్తకర సమాధానం చెప్పారు. పార్టీ పేరు ఏంటి అనేది అన్ని రకాలుగా ఆలోచిస్తున్నామనీ, ప్రముఖులు, పెద్దలు అందరితోనూ సంప్రదింపులు జరుపుతున్నామనీ.. టీఆర్ఎస్ అని కూడా పెట్టుకోవచ్చనీ, అందులో అభ్యంతరం ఏముందని కవిత చెప్పారు. ఇదే బీఆర్ఎస్‌లో భూకంపం సృష్టించింది. ఒక్కసారిగా ఆ పార్టీ ఉలిక్కిపడింది. అందుకు చాలా బలమైన కారణం ఉంది. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి అనేక కారణాల్లో పార్టీ పేరును మార్చడం కూడా ఒక కారణం అనే అభిప్రాయం చాలా మందిలో ఉంది. ఎప్పుడైతే టీఆర్ఎస్ కాస్తా బీఆర్ఎస్‌గా మారిందో.. అప్పటి నుంచి బీఆర్ఎస్‌లో బలమైన తెలంగాణ వాదం దూరమైందనీ, అందువల్ల తెలంగాణ ప్రజలు కూడా ఆ పార్టీకి దూరమయ్యారనే అభిప్రాయం ఉంది. పార్టీలోని కొందరు నేతలు కూడా మళ్లీ టీఆర్ఎస్ అనే పేరును మార్చుకుంటే మేలు అని కూడా చెప్పినట్లు సమాచారం. కానీ అధినేత కేసీఆర్.. తిరిగి పార్టీ పేరును టీఆర్ఎస్ అని మార్చేందుకు ఆసక్తి చూపలేదని తెలుస్తోంది. కానీ ఇప్పుడు అదే టెన్షన్ తెప్పిస్తోంది.

### ఒప్పుకున్న కేటీఆర్

కవిత ఆరోపణలు చేసినట్టే.. వెంటనే ఆమెకు సమాధానం కూడా వచ్చింది. ఇక్కడే కవిత ఏం ఊహించారో అది చిక్కినట్లుగా మారింది. తాజాగా మాట్లాడిన కేటీఆర్.. బీఆర్ఎస్ గా మార్చడం తప్పేనని, అంతేకాదు.. తాము అధికారంలో ఉన్నప్పుడు తప్పులు చేశామంటూ చెప్పుకొచ్చారు. కేటీఆర్ నోటి నుంచి ఈ వ్యాఖ్యలు రావడం కవిత విజయంలో తొలి భాగమే. మరోవైపు, నిజంగానే కవిత గనుక తన పార్టీ పేరును టీఆర్ఎస్ అని ప్రకటిస్తే.. అది బీఆర్ఎస్‌కి పెద్ద షాకే అవుతుంది. ఎందుకంటే ఇప్పటికీ తెలంగాణ పల్లెల్లో బీఆర్ఎస్ కంటే టీఆర్ఎస్ అనే పేరే బాగా నోటెడ్ అయ్యింది. అందువల్ల కవిత పార్టీకి ఒక్కసారిగా బీఆర్ఎస్ కార్యకర్తలు షిఫ్ట్ అయ్యే ప్రమాదం ఉంటుంది. అందుకే బీఆర్ఎస్‌లో కవిత మాటలు కలకలం రేపుతున్నాయి. అందుకు కేటీఆర్ తాజాగా చేసిన వ్యాఖ్యలే నిదర్శనం. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి చిట్ చాట్‌లో కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "బీఆర్ఎస్‌ను మళ్లీ టీఆర్ఎస్‌గా మార్చే అంశాన్ని పరిశీలిస్తాం" అన్నారు. ఇది చాలు.. కవిత క్రేజ్ పెరగడానికి.

### కవితకు అనుకూలమే

కవిత తన పార్టీకి టీఆర్ఎస్ అనే పేరు పెట్టడానికి వీలవుతుందా? అందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఒప్పుకుంటుందా అనే విషయంపై విశ్లేషకుల అంచనా ప్రకారం ఆ ఛాన్స్ ఉంది. ఏదైనా రాజకీయ పార్టీ తన పేరును మార్చిన తర్వాత 2 ఏళ్లు గడిస్తే ఇక పాత పేరును మరేదైనా పార్టీ పెట్టుకోవచ్చు. బీఆర్ఎస్ పార్టీ పేరు మారి.. చాలా ఏళ్లైంది కాబట్టి ఇప్పుడు కవిత టీఆర్ఎస్ అనే పేరును తన పార్టీ పేరుగా ఎంచుకుంటే.. ఎలాంటి అభ్యంతరాలూ ఉండవు. అందుకే కవిత ఇప్పుడు అదే ప్లాన్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ వ్యూహాన్ని ఏమాత్రం ముందుగా ఊహించని బీఆర్ఎస్.. ఇప్పుడు ఆ TRS పేరును తిరిగి దక్కించుకోవడానికి రెడీ అవుతున్నట్లు కేటీఆర్ మాటలను బట్టి అర్థమవుతోంది. కవిత గనుక టీఆర్ఎస్ పార్టీని స్థాపిస్తే.. అది బీఆర్ఎస్‌కి పెద్ద సవాలే అవు తుంది. ఇప్పటికే తెలంగాణ అంతా తిరుగుతున్నారు. ధర్నాలు చేస్తున్నారు, అరెస్టులూ అవుతున్నారు. ఇటీవల ఖమ్మంలో భూముల విష యంలో ధర్నా చేసి అరెస్టు కూడా అయ్యారు. ఆ తర్వాత ప్రభుత్వం దిగివచ్చింది. ఇది ఆమె కు ప్లస్ అయ్యింది. ఇలాంటి మంచి ఛాన్స్‌ని బీఆర్ఎస్ వదులుకుంది. ఇటీవల ఆమె దాదా పు ప్రతి రోజూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ జనం నోళ్లలో నానుతున్నారు.

### కేటీఆర్ భయపడుతున్నారా..?

ప్రతీ విషయంలో అద్భుతంగా వ్యూహాలు రచిస్తానని అనుకునే కేటీఆర్.. తన చెల్లి విషయంలో మాత్రం ఉచ్చులో పడినట్లైంది. ఇప్పుడు బీఆర్ఎస్ ఎంత త్వరగా వీలైతే, అంత త్వరగా టీఆర్ఎస్ పేరును వెనక్కి తీసుకోవాలని భావిస్తోంది. లేటైతే.. ఆ పేరును కవిత తీసుకుంటే మొదటికే మోసం వస్తుందని పార్టీలో వర్గాలు పదే పదే చెబుతున్నట్లు తెలుస్తోంది. కేసీఆర్ కూడా ఇప్పుడు ఈ పరిణామాలను ఆలోచిస్తున్నారని సమాచారం. మరి గులాబీ బాస్ వెనక్కి తగ్గుతారా? తన పంతాన్ని వదులుకొని.. టీఆర్ఎస్ పేరును తిరిగి పొందుతారా? అనే ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. ఒకవేళ బీఆర్ఎస్ గనుక టీఆర్ఎస్ అని పేరును మార్చుకుంటే.. అది కూడా కవితకే ప్లస్ అవుతుంది. కవితను చూసి భయపడి వెంటనే బీఆర్ఎస్.. టీఆర్ఎస్ అని పేరు మార్చుకుంది అని ఆమె అభిమానులూ, కార్యకర్తలూ సెటైర్లు వేసే ఛాన్స్ ఉంటుంది. అందువల్ల కేసీఆర్ ఇలా మెట్టు దిగుతారా అనేది ఆసక్తిగా మారింది. కవిత ఇప్పుడు చాలా వ్యూహాత్మకంగా ఈ స్టెప్ వేశారు. ఇది బీఆర్ఎస్ పార్టీ మొత్తాన్నీ ఆలోచనలో పడేసింది.మరోవైపు, టీఆర్ఎస్ అనే పేరు ఉన్నంత మాత్రాన ప్రజలంతా సపోర్ట్ చేస్తారనుకోవడం కూడా తప్పే అవుతోంది.

### కేసీఆర్ మౌనం

తల్లిదండ్రుల విషయంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు కేసీఆర్ ప్రస్తుత మానసిక స్థితిని ప్రతిబింబిస్తున్నాయని కొందరు అంటున్నారు. తన ఇద్దరు బిడ్డల మధ్య జరుగుతున్న ఈ ఆధిపత్య పోరు చూసి కేసీఆర్ లోలోపల బాధపడుతున్నారని పార్టీ సీనియర్లు చెబుతున్నారు. ఈ క్రమం లోనే తల్లిదండ్రులను ఏడిపించకూడదు అనే మాట ద్వారా కవితకు కేటీఆర్ ఒక ఎమోషనల్ వార్నింగ్ ఇచ్చారని అంటున్నారు.

కేటీఆర్ ఉద్దేశం ప్రకారం.. కవిత తన స్వతంత్ర నిర్ణయాల ద్వారా కేసీఆర్ గౌరవాన్ని దెబ్బతీస్తున్నారు. కవిత వాదన ప్రకారం.. కేటీఆర్ తనను పార్టీ నుంచి వెళ్లగొట్టేలా పరిస్థితులు సృష్టించారు. ఈ అన్నచెల్లెళ్ల మధ్య బ్రాండ్ యుద్ధం కూడా నడుస్తోంది. తెలంగాణ సెంటి మెంట్‌ను ఎవరు ఎక్కువగా ప్రతిబింబిస్తారు? అనే అంశంపై ఇద్దరూ పోటీ పడుతున్నారు. కవిత పాదయాత్రకు సిద్ధమవ్వడం, కేటీఆర్ దాన్ని లైట్ తీసుకోవడం చూస్తుంటే కుటుం బంలో అగాధం ఎంత పెరిగిందో అర్థమవుతోంది. కేటీఆర్ తండ్రి బాధపడుతున్నారన్న క్రమంలో కవితను విమర్శిస్తుం టే, కవిత తన ఆత్మగౌరవం సొంత రాజకీయ పార్టీ పెడుతున్నారు. ప్రజలు ఈ డ్రామాను గమనిస్తున్నారని, ఇది అంతిమంగా బీఆర్ఎస్ ఓటు బ్యాం కును చీల్చడమే కాకుండా, ప్రత్యర్థి పార్టీలకు బలమైన అస్త్రంగా మారుతుందని అభిప్రా యం వినిపిస్తోంది.

# మేం మద్దతు ఇస్తాం

(మొదటి పేజీ తరువాయి)

విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, అన్ని రాష్ట్రాల ఆందోళనలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ముం దడుగు వేయాలని ప్రధానిని కోరారు. లోక్‌సభ స్థానాల సంఖ్యను 50 శాతం మేర పెంచాలనే ప్రతిపాదనలపై స్పందిస్తూ, ఇది ఉత్తర మరియు దక్షిణాది రాష్ట్రాల మధ్య సీట్ల అంతరాన్ని మరింత పెంచుతుందని రేవంత్ రెడ్డి గణాంకాలతో వివరించారు. ఈ వివక్ష వల్ల దక్షిణాది రాష్ట్రాలు జాతీయ రాజకీయాల్లో అట్టడుగున పడిపోయే అవకాశం ఉందని, దీనిని నివారించడానికి పారదర్శకమైన విధానాన్ని అనుసరించాలని ఆయన డిమాండ్ చేశారు.



# ఇంటర్ ఫలితాల్లో 'రిషి' ప్రభంజనం



**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :** ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో మహబూబ్ నగర్ లోని రిషి జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 'రిషి' కళాశాల విద్యార్థులు ప్రతిభలో తమకెవ్వరు సాటిలేరని నిరూపిస్తున్నారు. ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో అత్యుత్తమ ఫలితాలు వారి ఖాతాల్లో వేసుకున్నారు.

**ప్రథమ సంవత్సరం ఫలితాల్లో..**

ఎంపీసీ విభాగం నుంచి యు. వినయ్ కుమార్ గౌడ్ 468 మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. వేణుమాధవ్ రెడ్డి, జి. అంకిత్, జి. మాధురి, ఎ. కార్తీక్ రెడ్డి, సృజన విద్యార్థులు 467 మార్కులతో ప్రతిభ చాటారు. బైపీసీ విభాగం నుంచి కె. అక్షిత, తానియా మహమూద్ 438 మార్కులతో ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నారు. శ్రావణి, భవిత, సౌమ్య, సురేంద్ర చక్రవర్తి, ఆయేషా జువా, అఖిల, అశ్లేష యాదవ్, మౌనిక, రిషిత, నాగ సాయి వైష్ణవి, మైవిన్, కె. మీనాక్షి సహా 14 మంది విద్యార్థులు 437 మార్కులు సాధించారు.

**ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో..**

ఎంపీసీ విభాగం నుంచి ఎం భావన 995 మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. మొహమ్మద్ అశ్వాక్ అహ్మద్, సయ్యద్ మిస్బావుద్దిన్, శ్రీవిద్య 992 మార్కులు సాధించగా, కోటేశ్వర్ 990 మార్కులు సాధించారు. బైపిసి విభాగం నుంచి అఫ్సా మోయిన్, పి.గాయత్రి, అమూల్య 994 మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. ఫారియా, ఫాతిమా కదీర్ 993 మార్కులు సాధించగా, నందిని రెడ్డి, వైశాలి 992 మార్కులు, శ్రీనిధి 991, సృజన, సుమేరా బేగం 990 మార్కులు సాధించారు.


ఈ సందర్భంగా కళాశాల చైర్ పర్సన్ చంద్రకళ వెంకట్, డైరెక్టర్ వెంకటయ్య, డీన్ భూపాల్ రెడ్డి, అకాడమిక్ డీన్ కళ్యాణ్ బాబు, ప్రిన్సిపాల్స్ రాఘవేంద్రరావు, వెంకటరత్నం, ప్రసన్నకుమారి విద్యార్థులను అభినందించారు. కళాశాల డైరెక్టర్ వెంకటయ్య మాట్లాడుతూ, తమ సంస్థలో కార్పొరేట్ స్థాయికి తగ్గకుండా నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. విద్యా ర్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.

# ఇంటర్ ఫలితాల్లో సి.వి. రామన్ విద్యార్థుల విజయకేతనం



**ముద్ర, వనపర్తి:** ఈ ఏడాది ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన సి.వి. రామన్ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధించినట్లు కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ తెలిపారు. అన్ని గ్రూపుల్లో విద్యార్థులు విశేష ప్రతిభను కనబరిచినట్లు పేర్కొన్నారు. తమ కళాశాలకు చెందిన 133 మంది విద్యార్థులు 900 కు పైగా మార్కులు సాధించారని చెప్పారు. జిల్లాలో ఇది రికార్డు ఫలితాలని వారు వెల్లడించారు. ఈ సందర్భంగా కళాశాల యజమాన్యం హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు. ఈ విజయానికి కృషి చేసిన అధ్యాపకులను, సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులను వారు అభినందించారు. కరస్పాండెంట్ డాక్టర్ వీరయ్య, డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, కుమారస్వామి, ప్రిన్సిపాల్ ప్రకాష్, సీనియర్ అధ్యాపకులు వెంకటరమణ, జమీర్ ఖాన్, మల్లిఖార్జున్, వెంకటేశ్వర్ రెడ్డి, లింగస్వామి, శ్రీధర్, చంద్రశేఖర్, హనుమంతరావు, మనీ వర్ధన్, మహేందర్, రమేష్, శేఖర్ గౌడ్, మహేష్, రవి తదితరులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
14.04.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**డాల్ఫిన్లు సమూహాలుగా జీవిస్తాయి (పోడ్)**

డాల్ఫిన్లు ఒంటరిగా కాకుండా గుంపులుగా ఉంటాయి. ఒకరికి ఒకరు సహాయం చేసుకుంటూ జీవిస్తాయి.





# ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ ప్రభంజనం

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**

ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా ఇంటర్ పరీక్షల్లో 'ప్రతిభ' జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఆదివారం విడుదలైన ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి అద్భుత విజయం సాధించారు. ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో రికార్డు స్థాయి ఫలితాలు నమోదయ్యాయి.

**ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ..**

ఎంపీసీ విభాగం నుంచి కె. రిషిక, ఆర్. రిషిత 468 మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. కె.చందన, స్నేహిత తదితరులు 467 మార్కులతో ప్రతిభ చాటారు. బైపీసీ విభాగం నుంచి డి. మానస 437 మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. పలువురు విద్యార్థులు 435,436 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో 432 మంది విద్యార్థులకు 400కు పైగా మార్కులు సాధించారు.

**ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో..**

ఎంపీసీ విభాగం నుంచి ఇ. వైష్ణవి 994 మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. యు. వైష్ణవి, డి. హర్షిత, కె. రాఘవి 993 మార్కులు సాధించగా, మరికొందరు విద్యార్థులు 990కి పైగా మార్కులు సాధించారు. బైపీసీ విభాగం నుంచి కె. వైష్ణవి 992, పి. సుప్రజ 991 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో 508 మంది విద్యార్థులు 900కు పైగా మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, కృషి చేసిన అధ్యాపక బృందాన్ని, సహకరించిన తల్లిదండ్రులను ప్రతిభ కళాశాల సలహాదారులు కె. మంజులాదేవి, వి. లక్ష్మారెడ్డి, కె. విష్ణువర్ధన్ రెడ్డి, కె. రఘువర్ధన్ రెడ్డి, కె. జనార్దన్ రెడ్డి, జి. వెంకటేశ్వర్ రెడ్డి, ప్రిన్సిపాళ్లు అభినందించారు.

# ఇంటర్ ఫలితాల్లో జలజం కళాశాల జయభేరి

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ ప్రతినిధి :**

ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో జలజం కళాశాల జయభేరి మోగించింది. ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఫలితాల్లో మహబూబ్‌నగర్ పట్టణంలోని జలజం జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచారు.

**ప్రథమ సంవత్సరం ఫలితాల్లో..**

ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్ష ల్లో డి. హరిని పూజిత 490 మార్కులు సాధించి కాలేజీ టాప‌ర్ గా నిలిచింది. జి. ప్రేమ్ కుమార్ 483, సరగొరి శ్రీనిత్య 481, ఎం. సంతోష్ 476, జి. హాసిని 473, ఎం.డి. జీషాన్ 472 మార్కులు సాధించారు.

**ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో..**

ద్వితీయ సంవత్సరం పరీక్ష ల్లో జి. ప్రణవ్ కుమార్ 982 మార్కులు, ఎన్. సాహితి 977 మార్కులు సాధించి ప్రతిభ చాటారు. ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ విభాగాల్లో జలజం జూనియర్ కళాశాల కొన్ని సంవత్సరాలుగా ఉత్తమ ఫలితాలు సాధిస్తోంది.ఈ కళాశాల విద్యార్థులు సీఏ, సీఎంఏ, క్లాట్ వంటి కోర్సుల్లో సీట్లు సాధించడం విశేషమని కళాశాల యాజమాన్యం తెలిపింది . ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ బోర్డు ప్రవేశపెట్టిన ఏసీఈ గ్రూప్‌ను కూడా కళాశాల లో ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరచిన విద్యార్థులను డైరెక్టర్ ఎస్. రమేష్ గౌడ్, ప్రిన్సిపాల్ కల్పన, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులు ఈ ఫలితాలు సాధించడం లో కళాశాల అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రుల కృషి ఎంతో ఉందని రమేష్ గౌడ్ పేర్కొన్నారు.



గత 20 సం॥లుగా పాలమూరు జిల్లా చరిత్రలోనే కనివినీ ఎరుగని రీతిలో అద్భుతమైన ఫలితాలను సాధిస్తున్న కళాశాల 'ప్రతిభ'

IPE-2026 RESULTS

MPC-I
468 K.Rishika | 468 R.Rishitha | 468 K.Chandana | 468 S.Prasanna Thara | 468 Y.Nandha Kishore
468 D.Appoorav Raj | 468 G.Jashwanth | 468 J.Rithwik Kumar | 468 V.Hrushikesh
467-10 Stu.
466-16 Stu.
465-14 Stu.

MPC-I లో 460 కు పైగా మార్కులు సాధించిన వారు 106

BiPC-I 438 Dandu Manasa | BiPC-I 437 R.Navya | BiPC-I 437 Rumana Firdous | BiPC-I 437 Hania Qurrathulain | BiPC-I 437 Iqra Rahmath

MPC-II 994 E.Vaishnavi | MPC-II 993 U.Vaishnavi | MPC-II 993 D.Harshitha | MPC-II 993 K.Raghavi | MPC-II 992 K.Shrivally

BPC-II 992 K..Vaishnavi | BPC-II 991 P.Supraja

అడ్మిషన్లు ప్రారంభమైనవి

Separate Hostel Facility for Boys & Girls

MPC-I, BPC-I లో 400కు పైగా మార్కులు సాధించిన వారు 432

MPC-II, BPC-II లో 900కు పైగా మార్కులు సాధించిన వారు 508

శ్రీ సాయి విద్యా సంస్థలు
ప్రతిభ జూనియర్ కళాశాలలు
IIT & MEDICAL ACADEMY
మహబూబ్‌నగర్.
వివరాలకు : 8125214952, 93462 32166, 88012 31229, 94404 55261, 99486 68669, 94923 51182.

# శ్రీపాదరావు స్ఫూర్తితో పనిచేస్తాం



- **శ్రీ పాదరావు విగ్రహావిష్కరణ చేయడం సంతోషం**
- **మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**ముద్ర, మంథని:**

స్వర్గీయ శ్రీపాదరావు ఆశయ సాధనలో శక్తి వంచన లేకుండా పనిచేస్తామని సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం మంథనిలో జరిగిన మాజీ స్పీకర్ శ్రీపాదరావు వర్ధంతి కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి మంత్రి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ శ్రీపాదరావు విగ్రహావిష్కరణకు తనను ఆహ్వానించడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. అజాతశత్రువుగా పేరున్న శ్రీపాద రావు ఇదే రోజు జరిగిన దుర్ఘటనలో మరణించడం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ కార్యకర్తలకు ఎవరికి కష్టం వచ్చినా శ్రీపాదరావు నేనున్నానంటూ భాగమయ్యారన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఒక మారుమూల గ్రామంలో జన్మించిన శ్రీపాద రావు ధన్వాడ సర్పంచ్ గా, మంథని సమితి ప్రెసిడెంట్ గా, మంథని ఎమ్మెల్యేగా సేవలు అందించారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ స్పీకర్ గా పని చేసి ఆ పదవికి వన్నె తెచ్చారని కొనియాడారు.

శ్రీపాదరావు రాజకీయ వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన శ్రీధర్ బాబు రాష్ట్ర రాజకీయాలతో పాటు జాతీయ రాజకీయాల్లో కీలకంగా మారారని చెప్పారు. తనలాంటి సామాన్య కాంగ్రెస్ కార్యకర్తకు క్యాబినెట్ లో అవకాశం కల్పించిన గొప్ప వ్యక్తి మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. శ్రీధర్ బాబు సహకారంతోనే రాష్ట్ర బడ్జెట్లో తన శాఖకు రూ. 17 వేల కోట్లు కేటాయించే అవకాశం దక్కిందన్నారు. ఎన్నికల సమయంలో ధర్మపురి ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు 2027లో నిర్వహించే గోదావరి పుష్కరాల వరకు ధర్మపురిలో బస్ డిపో ఏర్పాటుతో పాటు రెవెన్యూ డివిజన్ కేంద్రం, సబ్ ట్రెజరీ కార్యాలయం తదితర ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటుకు సహకరించాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ కోరారు.

# కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసులు

- **అంగన్ వాడీల సెల్ ఫోన్ల అంశంపై సీరియస్**


**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసులు పంపించారు. తనపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న అవినీతి ఆరోపణలను మంత్రి సీతక్క తిప్పికొట్టారు. బీఆర్ఎస్ నేతలు చేస్తున్న నిరాధార ఆరోపణలకు కేసీఆర్ బాధ్యత వహించాలని పేర్కొన్నారు. తెలంగాణలో అంగన్ వాడీ టీచర్లకు కొనుగోలు చేసిన సెల్‌ఫోన్ల అంశం అధికార, విపక్షాల మధ్య తీవ్ర మాటల యుద్ధానికి కారణం అవుతోంది. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క లక్ష్యంగా బీఆర్ఎస్ నేతలు మీడియా, సోషల్ మీడియాలో తీవ్ర అవినీతి ఆరోపణలు గుప్పిస్తున్నారు. దీనిపై ఇప్పటికే తీవ్రంగా స్పందిచారు. అయినప్పటికీ బీఆర్ఎస్ నేతలు వెనక్కి తగ్గకపోవడంతో మరోసారి మంత్రి సీతక్క స్పందించారు. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మంత్రి సీతక్క.. తాజాగా లీగల్ నోటీసులు జారీ చేశారు. 48 గంటల్లో



తనపై చేసిన పోస్టులను సోషల్ మీడియా నుంచి తొలగించి కేసీఆర్ క్షమాపణ చెప్పాలని సీతక్క డిమాండ్ చేశారు. లేని పక్షంలో న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

మంత్రి సీతక్క శాఖలో రూ.30 కోట్ల కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ సంచలన ఆరోపణలు గుప్పించారు. కేంద్ర ప్రభుత్వం అంగన్ వాడీ టీచర్లకు 38,130 స్మార్ట్ ఫోన్లు ఇచ్చేందుకు రూ.54.19 కోట్లతో టెండర్లు పిలిచారని తెలిపారు. శాంసంగ్ ఏ06 4జీ మోడల్ ఫోన్లను పంపిణీ చేయాలని నిర్ణయిస్తే.. టెండర్‌లో 5జీ ఫోన్లు అని పేర్కొన్నట్లు ఆరోపించారు. ఆ ఫోన్ ధర రూ.6 వేలేనని.. ప్రభుత్వం మాత్రం రూ.14,215లతో ఒప్పందాలు కుదుర్చుకుందని పేర్కొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
14.04.2026 మంగళవారం, హైదరాబాద్



మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## చదువే ఆయుధమన్న అంబేద్కర్



అతను పుట్టకుండా ఉండి ఉంటే ఈ మాట ఊహించడానికే కష్టం. జాతి మొత్తం ఎక్కువలు,తక్కువలతో నిండిపోయేది. బానిసత్వం అట్లానే ఉండిపోయేది. బడుగు, బలహీన వర్గాల బతుకులు మారకుండాపోయేవి. ఒక్క మాటలో చెప్పాలంటే మనుషులు మనుషుల్లా బ్రతికే అవకాశమే లేకుండాపోయేది. కుల, మత,భేదాలు లేని జాతి కోసం జీవితాంతం పోరాడిన గొప్పోడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్.

చదువుకోవాలంటే కులం అడ్డమొచ్చింది. మంచినీరు త్రాగాలి అంటే జాతి అడ్డు పడ్డది. పనులు చేసే కాడ దండం పెట్టుడుకాడ, ఇది గది అని లేదు, అన్ని జాగల్లా అప్పట్లా తక్కువ కులపోళ్ళకు కులమే నరకం చూపించ్చేటిది. 1891 ఏప్రిల్ 14న తక్కువ కులంగా ముద్ర పడిన మహర్ కులంలో పుట్టిననాడు అంబేద్కర్. మిగతా వాళ్ల లెక్కనే అంబేద్కర్ కూడా చిన్న వయసులోనే మస్తు బాధలు పడ్డాడు. అయితే అందరిలెక్క అంబేద్కర్ బెదిరిపోలే. తన లెక్క ఎవరు బాధపడొద్దని, తక్కువ కులంలో పుట్టెటోళ్ళ భవిష్యత్ మంచిగా ఉండాలని ఆలోచించాడు. ముంబైలోని హెల్ఫిన్ స్టోన్ హైస్కూల్‌లో చదివినప్పుడు, కుల పిచ్చి ఎట్లుందో అంబేద్కర్ కి అర్థమైంది. అంటరాని కులంలో పుట్టినటువంటి అంబేద్కర్ ని క్లాస్ రూమ్ లోకి కూడా రానియ్యాలే, బయటనే ఉండి పాఠాలు విన్న అంబేద్కర్, చదువులో ఎప్పుడూ టాపర్ వచ్చేటోడు. 1907లో మెట్రిక్యులేషన్ పూర్తి చేసిండు. 1912 లో ముంబై యూనివర్సిటీ నుంచి ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్‌లో డిగ్రీ పట్టా పొందినాడు. తర్వాత బరోడా రాజు సంస్థానంలా ఏడాదిపాటు గుమస్తా గిరి చేసిండు. అప్పుడు అంబేద్కర్ సత్తా ఏందో జనాలకు తెలిసొచ్చింది. అంబేద్కర్ మస్తు తెలివైన వాడని బరోడా రాజు గుర్తుపట్టి పై చదువుల కోసం అమెరికాకు పంపించిండు. గట్ల కొలంబియా యూనివర్సిటీలో పీజీ,పీహెచ్ డి పూర్తి చేసిండు అంబేద్కర్. తర్వాత లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ లో చేరి చదువుకున్నాడు. 1921,1923 ల రెండు డాక్టరేట్లు పొందినాడు. అంబేద్కర్ కు నాలుగు పీహెచ్ డి డాక్టరేట్లు సంపాదించిన గొప్పవాడిగా అంబేద్కర్ పేరు సంపాదించుకున్నాడు. 1926 ల లాయర్ గా ప్రాక్టీస్ మొదలు పెట్టినాడు అంబేద్కర్. అప్పుడే అంటరానితనం మీద మొదటిసారి పిడికిలి బిగించిండూ. బహిష్కృత హితకారిణి సభ అనే సంస్థ ఏర్పాటు చేసి దళితుల అభ్యున్నతి కోసం కష్టపడింద్రూ. అట్టడుగు వర్గాలకు చదువే ఆయుధమని ప్రచారం చేసిండు అంబేద్కర్. అంటరాని కులస్తులుగా ముద్రపడిన వాళ్లందరినీ గుళ్లలోకి తీసుకుపోయిండూ. వాళ్ల మీద ఉన్న నిషేధాన్ని ఎదిరించి చెరువులల్లో మంచినీళ్లు త్రాగేటట్టు చేసిండూ. కులం జులుం మీద తిరగబడ్డాడు అంబేద్కర్. 1936ల ఇండిపెండెంట్ లేబర్ పార్టీ పెట్టి ముంబయి సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి పోటీ చేసిండు అంబేద్కర్. ఆ తర్వాత ఒక రాజకీయ పార్టీలో చేరి దళితుల గొంతుక వినిపించాడు. తక్కువ కులం వాళ్ళకు ప్రత్యేక నియోజకవర్గాలు కావాలని పట్టుబట్టిండూ. దేశానికి తొలి న్యాయశాఖ మంత్రిగా పని చేసిండూ అంబేద్కర్. అదే టైంలో దేశానికి దశ దిశ చూపేందుకు రాజ్యాంగ రచన బాధ్యతలు తీసుకున్నాడు.రాజ్యాంగం రాసిన కమిటీకి చైర్మన్‌గా పనిచేసిండు అంబేద్కర్. బడుగుల బతుకులు మార్చేందుకు ఉద్యోగాల్లో, చదువుల్లో రిజర్వేషన్లు తీసుకొచ్చినాడు. భారత రాజ్యాంగం ఇంత మంచిగా ఉంది అంటే దానికి అంబేద్కర్ తెలివితేటలే కారణమని ఇప్పటికీ గొప్పగా చెప్పుకుంటారు. కుల వ్యవస్థను వ్యతిరేకిస్తూ బౌద్ధమతం తీసుకున్నాడు అంబేద్కర్. బడుగులు, అనగా తొక్కిన వాళ్లందరి బ్రతుకులు మార్చేందుకు జీవితాంతం పోరాటం చేసిన బాబాసాహెబ్ అంబేద్కర్ 1956 డిసెంబర్ 6న కన్నుమూశాడు. తాను తీసుకువచ్చిన చైతన్యాన్ని వీలైనంత ముందుకు తీసుకు పోండి, చేత కాకపోతే అక్కడే వదిలేయండి అంతేగానీ వెనుకకు మాత్రం తీసుకోవద్దని అంబేద్కర్ చెప్పినాడు. గట్ల అంబేద్కర్ నింపిన చైతన్యం కోట్లాది మంది లో ప్రవహిస్తూనే ఉంది.



**(ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి సందర్భంగా)**
**గుండమల్ల సతీష్ కుమార్.**
**9493155522.**

## బహుజనుల ఆశాజ్యోతి నవభారత నిర్మాణ కీర్తి!!

ఓ బడుగు జనుల ఆశాజ్యోతి
ఓ బహుజనుల విప్లవ ఖ్యాతి
కులాల కుళ్ళును చూసి
మతాల మౌడ్యాన్ని చూసి
బడుగు వారల బాధల్ని చూసి
గుండెలవిసిన జీవితాలు తెలిసి
ధీన జనుల బ్రతుకువెలుగురీతిగా
సిరిసంపదలందరికీ సమాన రీతిగా!
మహిత వందేమాతర గీత ఫలం
పీడిత తాడిత జనత శ్రామిక ఫలం
విరిసే రీతిగా మురిసే జ్యోతిగా
కుల పోరాటములు చేసినవాడా
ఆ మనుస్మృతి నిరసించిన వాడా!
బహుజనులకు ఆశాజ్యోతివి
బలహీనుల ఆత్మవిశ్వాసానివి
అభినవ నవభావాల
రాజకీయ కార్యదర్శివి
పీడిత బహుజనులకు
రాజ్యాంగ మార్గదర్శివి
అతుల నిరుపమోజ్వల అగ్నికణమా
బహుజనులకు ఆశాజ్యోతి కిరణమా
జగతి మేధావి వర్గపు సవ్యసాచి
సకల విద్యల వరవిజ్ఞాన విరించి!
బహుజనుల ఓ అంబేద్కర్ మహాశయా...
వర రాజ్యాంగ నిర్మాత
మహెూపాధ్యాయా...
నీకు ఇవే భరతజాతి హృదయపూర్వక
నీరాజనాలు
నీకు ఇవేభవ్య చరిత వర పూజిత శ్రద్ధాంజలులు
భావి భారత దేశ ప్రజల తరపున ఘన నివాళులు...!!

**- జటావత్ రాజు (యువ కవి, రచయిత)**
**తెలంగాణ విశ్వవిద్యాలయం,**
**నిజామాబాద్.9347196364.**




# హర్ముజ్ జలసంధి టూ విజయనగర సామ్రాజ్యం



- శ్రీకృష్ణదేవరాయల 'అముక్తమాల్యద'లో హర్ముజ్ ప్రస్తావన..
- వెలుగులోకి చారిత్రక బంధం!
- విజయనగర కాలంలో హర్ముజ్ ద్వారా విస్తరించిన సముద్ర వాణిజ్యం
- శ్రీనాథుడి సాహిత్యంలో "హురుమాంజి"గా హర్ముజ్ ప్రస్తావన
- ఇరాన్ నుంచి గుర్రాలు, ఎండుఫలాల దిగుమతిలో కీలక పాత్ర
- కాకతీయుల నుంచి రాయలవారి వరకు కొనసాగిన సముద్ర మార్గాలు
- పర్షియన్ సంస్కృతి ప్రభావం తెలుగు ప్రాంతాలపై ప్రభావితం

ఇరాన్, అమెరికా యుద్ధం గురించి ప్రతిరోజు మనం వార్తలు వింటూనే ఉన్నాం. ఏదో ఒక రకమైన విషయాన్ని తెలుసుకుంటూనే ఉన్నాం. ఇరాన్, అమెరికా యుద్ధానికి సంబంధించిన వార్తలు వచ్చిన ప్రతి సందర్భంలోనూ హర్ముజ్ జల సంధి గురించి ప్రస్తావన వస్తూనే ఉంది. వాస్తవానికి ఇది మామూలు జల సంధి కాదు. ప్రపంచ వర్తకానికి.. ప్రముఖంగా చెప్పాలంటే ఇరాన్ దేశానికి సంబంధించిన ఆర్థిక రంగానికి కీలకమైన వనరు.

హర్ముజ్ జల సంధికి శతాబ్దాల చరిత్ర ఉంది. ఈ జల సంధి ప్రపంచానికి సాంస్కృతిక వారసత్వాన్ని ప్రసాదించింది. వ్యాపారం, వాణిజ్య కార్యకలాపాలకు కీలకంగా నిలిచింది. దక్షిణాది రాష్ట్రాలకు కీలకమైన వారధిగా కొనసాగింది. కాకతీయుల పరిపాలన కాలంలో.. శ్రీకృష్ణదేవరాయల హయాంలో ఈ జల సంధి ప్రస్తావన ఉన్నట్టు చరిత్రకారులు చెబుతున్నారు.

రాయలవారు పరిపాలిస్తున్న కాలంలో శ్రీనాథ కవి సార్వభౌముడు తాను రచించిన సాహిత్యంలో ఈ జల సంధిని హురుమాంజి అని ప్రస్తావించాడు. దీని ద్వారా అనేక రకాలుగా వ్యాపారాలు సాగినట్టు తాను రాసిన హర విలాసంలో శ్రీనాథుడు ప్రస్తావించాడు. నాటి రాయలవారి కాలంలో తిప్పయ్య శెట్టి అనే వ్యాపారి హర్ముజ్ జల సంధి నుంచి అనేక రకాలైన వస్తువులను తెచ్చి అమ్మేవాడని శ్రీ నాథుడు ప్రస్తావించారు. ఇరాన్ దేశంలో పండే బాదాం.. ఖర్జూర.. ఇతర ఎండు ఫలాలను అక్కడి నుంచి ఇక్కడికి తెచ్చి అమ్మేవాడని శ్రీ నాథుడు తన గ్రంథంలో ప్రస్తావించాడు. శ్రీ కృష్ణదేవరాయలు తన పరిపాలన కాలంలో రాజ్యానికి అవసరమైన గుర్రాలను ఇరాన్ దేశం నుంచి తెప్పించుకునే వారని.. నాడు భారీ పడవల మీదుగా గుర్రాలు వచ్చేవని.. వాటి రవాణాలో హర్ముజ్ జల సంధి కీలక పాత్ర పోషించేదని తెలుస్తోంది. అముక్తమాల్యదలో కూడా హర్ముజ్ జల సంధి ప్రస్తావన ఉంది. కాకతీయుల కాలంలో హర్ముజ్ నుంచి అనేక వస్తువులు మోటుపల్లి, మచిలీపట్నం ఓడరేవులకు సరఫరా అయ్యేవి.

**పర్షియన్ సంస్కృతి**


ఇరాన్ దేశంలో పర్షియన్ సంస్కృతి ఉంటుంది. 15వ శతాబ్దంలో తెలుగు సాహిత్యంలో పరిషత్ సాంస్కృతి ప్రస్తావన ఉంది. వాస్తవానికి గ్రీస్ నాగరికత అత్యంత ప్రాచీనమైనది. అయినప్పటికీ పర్షియన్ సాంస్కృతి అనేక దేశాలకు విస్తరించింది. మాంసాహార వంటకాలు.. బిర్యానీలు.. డబుల్ కా మీఠా.. తందూరి రోటీలు.. బాదుషా, జిలేబి.. ఇలా చెప్పుకుంటే ఎన్నో వంటకాలు పర్షియన్ ప్రాంతాల నుంచి ఇక్కడికి దిగుమతి అయ్యాయి. ఆ తర్వాత మన వంటకాలలో ప్రధాన భాగంగా మారిపోయాయి.

నాటి కాలంలో రాజులను పర్షియన్ సంస్కృతి విపరీతంగా ప్రభావితం చేసేది. రాయలవారు పర్షియన్ పాలకుల విధానాన్ని ఎక్కువగా అనుకరించేవారు. తన అమూక్త మాల్యదలో కూడా ఈ విషయాన్ని ఆయన ప్రస్తావించారు. అంతేకాదు ఆ మీరు అనే పదానికి అమర నాయకుడని.. సుల్తాన్ అనే పదానికి సూరత్రాన అనే పదాలను శ్రీకృష్ణదేవరాయలు వాడుకలతీసుకొచ్చారు. రాయలవారు పరిపాలిస్తున్న కాలంలో పర్షియన్ ప్రాంతానికి.. విజయనగర ప్రాంతానికి విస్తృతంగా రాకపోకలు సాగేవి. పర్షియన్ ప్రాంతాల నుంచి



వ్యాపారవేత్తలు ఇక్కడికి వచ్చి లావాదేవీలు కొనసాగించేవారు. చాలామంది వ్యాపారులు విజయనగరంలో స్థిరపడ్డారు. అక్కడి నుంచి ఎండుఫలాలు వస్తే.. ఇక్కడి నుంచి సుగంధ ద్రవ్యాలు ఎక్కువ చేసేవారు.

## అందమైన డాల్ఫిన్ జాతి అంతరించనుందా !



**– 14 ఏప్రిల్ "జాతీయ డాల్ఫిన్ దినోత్సవం" సందర్భంగా..**

ప్రకృతిలో అత్యంత తెలివైన, స్నేహపూర్వక జలచరాలలో డాల్ఫిన్‌లు ప్రత్యేక స్థానం సంపాదించాయి.కానీ ఈ అందమైన జీవాలు నేడు మనుషుల చర్యల వల్ల అంతరించిపోవాలనే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. జాతీయ డాల్ఫిన్ దినోత్సవం సందర్భంగా ఇది కేవలం ఒక జ్ఞాపక దినం మాత్రమే కాకుండా, బాధ్యతను గుర్తుచేసే రోజు కూడా కావాలి. భారత్ జాతీయ జలచరంగా గుర్తింపు పొందిన గంగా డాల్ఫిన్ పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది. నదుల కాలుష్యం, నీటి మళ్లింపు ప్రాజెక్టులు, అక్రమ వేట, ఆవాసాల నాశనం——ఈ అన్ని కారణాలు కలిసి వాటి జీవనాన్ని క్రమంగా సంకుచితం చేస్తున్నాయి. ఒకప్పుడు విస్తృతంగా కనిపించిన ఈ జాతి, ఇప్పుడు కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితమవడం మన అభివృద్ధి నమూనాపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.డాల్ఫిన్లు కేవలం జలచరాలు కాదు; అవి ఆరోగ్యకరమైన జల వ్యవస్థలకు సూచికలు. అవి ఉన్న చోట జీవ వైవిధ్యం సమతుల్యంగా ఉంటుంది. కాబట్టి డాల్ఫిన్లను కాపాడటం అంటే మన నీటి వనరులను, మన భవిష్యత్తును కాపాడటం అనే అర్థం.ప్రభుత్వం చేపట్టిన "ప్రాజెక్ట్ డాల్ఫిన్" వంటి చర్యలు సరైన దిశలో ఉన్నా, అవి మాత్రమే సరిపోవు.ప్రజల భాగస్వామ్యం, పర్యావరణ అవగాహన, కఠిన చట్టాల అమలు.. ఈ మూడు కలిసే ఫలితాన్ని ఇస్తాయి. ప్రతి పౌరుడు నదులను కలుషితం చేయకుండా ఉండటం, ప్రకృతిని గౌరవించడం ద్వారా ఈ పోరాటంలో భాగస్వామి కావాలి.డాల్ఫిన్ చిరునవ్వు మనసుకు ఆనందాన్ని ఇస్తుంది. ఆ చిరునవ్వు భవిష్యత్ తరాలకు కూడా కనిపించాలంటే, ఈరోజే చర్యలు ప్రారంభించాలి. అంతరించిపోతున్న ఈ అందమైన జీవాన్ని కాపాడటం మన సమిష్టి బాధ్యత.




**డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**



## ప్రశాంతతకు నిలయం తవాంగ్

హిమాలయ పర్వతాల మధ్య, పచ్చని లోయలు, మంచుతో కప్పబడిన శిఖరాలతో ఈ ప్రదేశం మనసుకు హాయినిస్తుంది. బౌద్ధ మఠాలు, ప్రార్థనా జెండాలు, స్వచ్ఛమైన గాలి ఇక్కడి వాతావరణానికి ఆధ్యాత్మిక శోభను చేకూరుస్తాయి. తవాంగ్ అందం, నిశ్శబ్దం ప్రతి పర్యాటకుడి హృదయంలో చిరకాలం నిలిచిపోతాయి. ఇది అరుణాచల్ ప్రదేశ్ లోని తవాంగ్ వద్ద ఉన్న బంగారు వర్ణంలో మెరిసే భారీ బుద్ధ విగ్రహం. సుమారు 30 అడుగుల ఎత్తులో ధ్యాన ముద్రలో కూర్చుని ప్రశాంతతను పంచుతుంది.రంగు రంగుల టిబెటన్ శైలి అలంకరణలతో కూడిన పీఠంపై ఈ విగ్రహం భక్తులను, పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తుంది.



**ఎ. విజయ్ కుమార్**

**డాల్ఫిన్లు**



శబ్దాలతో కమ్యూనికేషన్ ఈలలు, క్లిక్ శబ్దాలతో మాట్లాడు కుంటాయి.ఎకోలోకేషన్ ద్వారా మార్గం గుర్తిస్తాయి.

## సంక్షిప్తంగా..

### సేవాలాల్ భవనాన్ని పూర్తి చేయాలి



**ముద్ర, నారాయణపేట:** నియోజకవర్గ కేంద్రంలో సేవాలాల్ భవన నిర్మాణం కోసం 332 జీవో గతంలో విడుదలైందని, రీటెండర్ నిర్వహించి వెంటనే పూర్తి చేయాలని సేవాలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నవావత్ రాజు ఆధ్వర్యంలో వల్య నాయక్, చంద్రశేఖర్, హరి, సమీర్లో సోమవారం ఆర్డీవో, ఎమ్మెల్యే పీఏ మాధవరెడ్డికి వేరువేరుగా వినతిపత్రం అందించారు.

### చలివేంద్రం ఏర్పాటు



**ముద్ర, మల్కాజిగిరి:** మణికొండ భాగ్యలక్ష్మి కాలనీలో ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవాలయం వద్ద చలివేంద్రాన్ని సంఘ సేవకుడు, సామాజికవేత్త మాదిరెడ్డి పెంటారెడ్డి సోమవారం ప్రారంభించారు. స్వచ్ఛంద సేవా సంస్థ నవ సేవా సంకల్ప ఆధ్వర్యంలో ఈ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చైర్మన్ మణి తెలిపారు. సీనియర్ పాత్రికేయుడు తిప్పరాజు రమేష్ బాబు, దేవాలయ సభ్యుడు మల్లారెడ్డి, తానాషా నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, సినీ నటుడు శ్రీహరి, సర్దార్ పటేల్ పార్క్ వాక్ మేట్స్ పాల్గొన్నారు.

### కత్తర్ చాయ్ వాలా షాపును తొలగించండి



**ముద్ర, మల్కాజిగిరి:** నేరెడ్మేట్, డిఫెన్స్ కాలనీలో ఉన్న కత్తర్ చాయ్‌వాలా షాప్ తొలగించాలని డిఫెన్స్ కాలనీ నివాసితుల సంక్షేమ సంఘం నాయకులు, కాలనీవాసులు డిమాండ్ చేశారు. తమ నివాస ప్రాంతంలో అనధికార వాణిజ్య సంస్థలు, నిర్మాణాలను అనుమతించవద్దని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను అభ్యర్థిస్తూ ప్లకార్డులతో నిరసన చేపట్టారు. కొన్నేళ్లుగా ఈ నివాస ప్రాంతంలో వాణిజ్య కార్యకలాపాలు పుట్టగొడుగుల్లా పెరిగిపోయాయని తెలిపారు. ఈ కూడలిలో సందడి చేసే జనసమూహం గుండా తమ ఆడపిల్లలు సురక్షితంగా నడవలేక పోతున్నారన్నారు. 60 అడుగుల రోడ్డుపై బైక్ రేసింగ్ నిర్వహిస్తున్నారని, అబ్బాయిలు, అమ్మాయిలు ధూమపానం చేస్తూ బీర్ సీసాలతో కొట్టుకుంటూ అరుస్తూ నానా హంగామా చేస్తున్నారని, దీంతో తమ కుటుంబాలు స్వేచ్ఛను కోల్పోతున్నాయ ని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార యంత్రాంగం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని లేకుంటే ఆందోళనకు దిగుతామని వారు హెచ్చరించారు.

### చిన్నారిని ఆదుకోండి

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:**ఆడుతూ పాడుతూ తల్లిదండ్రుల చెంత ఆనందంగా ఉండాల్సిన అరు నెలల చిన్నారిని అరుదైన వ్యాధి వెంటాడుతోంది. వివరాలు ఇలా ఉన్నాయి. గద్వాల మండలం పరుమాల గ్రామానికి చెందిన మౌనిక రమేష్ కూతురు చైత్రికకు అత్యంత అరుదైన స్పైనల్ మస్క్యులర్ అట్రోఫి (ఎస్ఎంఏ) టైప్ –1 వ్యాధి సోకిందని హైదరాబాద్లోని రేయిన్ బో ఆస్పత్రి లో ఇటీవల చేయించిన వైద్య పరీక్షల్లో బయటపడింది. ఈ వ్యాధి వల్ల కండరాలు బలహీనపడి ఊపిరిపీల్చుకోవడం కూడా కష్టమవుతుంది. చిన్నారి కి రూ.16 కోట్లు విలువ గల ఏవీఎక్స్ ఎస్ –101 ఇంజెక్షన్ వేయాలని వైద్యులు సూచించారు. ఈ ఇంజెక్షన్ భారతదేశంలో లేకపోవడం తో అమెరికా నుంచి తెప్పించాల్సి ఉంటుందని వైద్యులు తెలిపినట్లు వారు తెలిపారు. ప్రైవేటు ఉద్యోగంతో జీవనం సాగించే తాము భారీ మొత్తాన్ని భరించే స్థితిలో లేమని, సహకరించి తమ బిడ్డ ప్రాణాలు కాపాడాలని రమేశ్ వేడుకున్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరెట్ కార్యాలయ సమావేశం హాలు నందు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలు విన్నవిస్తూ దరఖాస్తు లు సమర్పించా రని తెలిపారు. 138 వినతులు అందాయన్నారు. కార్యక్రమం లో జడ్ పి సి ఇ ఓ సుధీర్, ఆర్ డి ఓ వాసు చంద్ర, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, జిల్లా అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



**ప్రజావాణికి 102 దరఖాస్తులు**

**నాగర్‌కర్నూల్, ముద్ర ప్రతినిధి:** ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, అర్జీలను వేగంగా పరిష్కరించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్ లాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సీఈవో దేవ సహాయం, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్‌లతో కలిసి అర్జీలు, వినతులు స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 102 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా సమీక్షించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

**హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదుల వరద**

**ముద్ర, హైదరాబాద్:** హైడ్రా ప్రజావాణికి కాలనీల నుంచి అధిక మొత్తంలో ఫిర్యాదులు వస్తున్నాయి. వివిధ ఆక్రమణలపై హైడ్రా ప్రజావాణికి మొత్తం 46 ఫిర్యాదులు రాగా హైడ్రా అదనపు కమిషనర్ ఆర్. సుదర్శన్ విచారించి పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు. లే ఔట్ వేసినప్పుడు చూపించిన పార్కులు తర్వాత ప్లాట్లుగా మారిపోతున్నాయని, రహదారికి ఇరువైపులా ప్లాట్లు కొనడం.. మధ్యలో రహదారిని మాయం చేయడం లే ఔట్లలో పరిపాటిగా మారిందని పేర్కొంటున్నారు. బౌరంపేట్ గ్రామంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి, అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టినట్లు స్థానికులు ఫిర్యాదు చేశారు. ప్రజా ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు కోసం ఈ భూమిని కేటాయించాలని కోరారు.

## ప్రజావాణికి రెండు ఫిర్యాదులు

**అదనపు ఎస్పీ ఎన్ వెంకటేశ్వర్లు**



**నాగర్‌కర్నూల్, ముద్ర ప్రతినిధి:** జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా అదనపు ఎస్పీ ఎన్ వెంకటేశ్వర్లు ఫిర్యాదుదారుల నుంచి రెండు ఫిర్యాదులను స్వీకరించారు. భార్యాభర్తల వివాదానికి సంబంధించిన ఒక అర్జీ, న్యాయ సంబంధిత మరో అర్జీ స్వీకరించారు. సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్ఐ, సిఐలతో ఫోన్ ద్వారా మాట్లాడి, సమస్యల స్థితిని తెలుసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించడం, ప్రజలకు చేరువ చేయడం, శాంతి భద్రతలను కాపాడడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

# ఇంటర్ కేజీబీవీ విద్యార్థినీల ఉత్తమ ప్రతిభ



**నాగర్‌కర్నూల్, ముద్ర ప్రతినిధి:** జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల (కేజీబీవీ) విద్యార్థినులు ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన బాలికలు మెరుగైన ఫలితాలు సాధించడం విద్యా రంగంలో కేజీబీవీల ప్రాముఖ్యతను మరోసారి చాటిచెప్పింది. జిల్లాలోని 11 కేజీబీవీలలో ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలకు మొత్తం 509 మంది విద్యార్థినులు హాజరుకాగా, వీరిలో 438 మంది ఉత్తీర్ణత సాధించారు. దీంతో ద్వితీయ సంవత్సరంలో 86 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ ఫలితాల్లో 85 మందికి పైగా విద్యార్థినులు 900కు పైగా మార్కులు సాధించి ప్రతిభ చాటుకున్నారు. అలాగే ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలకు జిల్లాలోని 20 కేజీబీవీల నుంచి 1,024 మంది విద్యార్థినులు హాజరుకాగా, వీరిలో 792 మంది ఉత్తీర్ణత సాధించారు. దీంతో ప్రథమ సంవత్సరంలో 77 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇందులో 150 మందికి పైగా విద్యార్థినులు 400కు పైగా మార్కులు సాధించడం విశేషం.జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉన్నతాధికారుల పర్యవేక్షణ మరింత మెరుగుపడితే ఉత్తీర్ణత శాతం ఇంకా పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. గ్రామీణ బాలికల విద్యాభివృద్ధిలో కేజీబీవీల పాత్ర రోజురోజుకు బలపడుతోందని అధికారులు తెలిపారు. అలాగే ఫెయిల్ అయిన విద్యార్థినులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం చేయనున్నట్లు వెల్లడించారు.

## జనగణన సమర్థవంతంగా నిర్వహిస్తాం

**జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**




**నాగర్ కర్నూల్, ముద్ర ప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జనగణన ప్రక్రియను జిల్లాలో పకడ్బందీగా అమలు చేయడానికి జిల్లా యంత్రాంగం సమగ్ర చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర జనగణన డైరెక్టర్ భారతి హోళీకేరి సమీక్ష సమావేశం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ జనగణన–2027 మొదటి విడతలో భాగంగా ఇండ్ల గణన విధులను అధికారులు, సిబ్బంది సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో మూడు విడతలుగా నిర్వహించే ఈ ప్రక్రియ కోసం 460 పంచాయతీలు, మున్సిపాలిటీల్లోని 85 వార్డుల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మొత్తం 1,799 మంది ఎన్యూమరేటర్లు, 263 మంది సూపర్వైజర్లను ఎంపిక చేసినట్లు, అదనంగా 10 శాతం సిబ్బందిని కూడా సిద్ధంగా ఉంచుతున్నట్లు వెల్లడించారు. ఈనెల 18 నుంచి మే 5 వరకు జనగణనపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి సుజాత, అధికారులు పాల్గొన్నారు.

# మండల్ ఆశయాలు సాధిద్దాం

**- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :** బీ.పీ మండల్ ఆశయాల సాధనకు కాంగ్రెస్ సర్కార్ కట్టుబడి ఉందని యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ లోని పద్మావతి కాలనీ గ్రీన్ బెల్ట్ లో ఉన్న బి.పి.మండల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ సంకల్పించిందని, తెలంగాణలో 42 శాతం రిజర్వేషన్ల అమలుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కేంద్రంలో ఉన్న ప్రభుత్వం ఈ ప్రక్రియను అడ్డుకుంటోందని విమర్శించారు. ఓబీసీలకు హక్కుగా రావాల్సిన వాటాను ఇప్పటివరకు చట్టబద్ధం చేయడంలో విఫలమైందని పేర్కొన్నారు. ఇది బిక్ష కాదని, ఓబీసీల హక్కు అని ఆయన స్పష్టం చేశారు. ఓబీసీల హక్కుల కోసం దేశ స్థాయిలో ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అంతకుముందు రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మేయర్ గుమ్మాల మమత, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి , డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాములు యాదవ్, జిల్లా గొర్ల కాపరుల సంఘం అధ్యక్షులు శాంతయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, అజ్మత్ అలి పాల్గొన్నారు.

**పాలమూరు అభివృద్ధికి పాటుపడుతా**

పాలమూరు అభివృద్ధే ప్రధాన ఎజెండా గా పెట్టుకుని పనిచేస్తానని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిఅన్నారు. సోమవారం మహబూబ్ నగర్ లోని అల్మాస్ ఫంక్షన్ హాల్ లో ముస్లిం సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్‌తో పాటు మేయర్ గుమ్మాల మమత, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, కార్పొరేటర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ నగరాన్ని ట్రాన్స్‌పోర్ట్ , మెడికల్ హబ్‌గా అభివృద్ధి చేయడానికి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, అజ్మత్ అలి, మహబూబ్ నగర్ ముస్లిం సంఘం అధ్యక్షులు ఎంఎ అలీం, కార్యదర్శి మహ్మద్ బషీరుద్దీన్, సభ్యులు ఖాజా మైనోద్దీన్, ఎంఎ రహమాన్, కార్పొరేటర్లు పాల్గొన్నారు

## వడగాలుల నుంచి అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**ముద్ర, వనపర్తి:** జిల్లాలో రానున్న వారం రోజుల్లో భారీగా వడగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి కోరారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో తగు సూచనలు చేశారు. ప్రజలకు ఎండల వేడిమి నుంచి ఉపశమనం కల్పించే విధంగా అక్కడక్కడ తాగునీటి కోసం చలివేంద్రాలని ఏర్పాటు చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉండాలని సూచించారు. విద్యార్థులకు ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశాల్లో చల్లని తాగునీరు సహా చలువ నీడ కోసం టెంట్ ఏర్పాటు చేయాలని, నీరు ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయలేదని దృష్టికి వస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. మిషన్ భగీరథ అధికారులు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, జెడ్పి సీఈవో యాదయ్య, డిఎస్పీ బాలాజీ నాయక్, డిటీఓ మానస, డి ఆర్ డి ఓ ఉమాదేవి, సిపిఓ హరికృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం






**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణకు "అరైవ్ అలైవ్" కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతోనే రోడ్డు భద్రత సాధ్యమని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు. కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామపంచాయతీలో సోమవారం "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ వరలక్ష్మి సొంత నిధులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కలెక్టర్ ప్రారంభించారు. గ్రామ భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణలో సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతిరోజూ "అరైవ్ అలైవ్" కార్యక్రమాలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్డీవో చిన్న బాలు, గ్రామ సర్పంచ్ వరలక్ష్మి, కల్వకుర్తి డీఎస్పీ, తహసిల్దార్ పాల్గొన్నారు.

**అతివేగం రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం**

**ముద్ర, నారాయణపేట:** రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం అతివేగం, అజాగ్రత్త, రోడ్డు నియమ నిబంధనలు పాటించకపోవడమేనని నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ కుమార్ అన్నారు. దామరగిద్ద మండల కేంద్రంలో అలాగే కోస్గి మండలం గుండుమల్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాధ్యతాయుతంగా వాహనం నడిపి, తమతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు. చిన్న నిర్లక్ష్యాలే పెద్ద ప్రమాదాలకు దారితీస్తాయని, అలాంటి సంఘటనలు కుటుంబాలకు తీరని నష్టాన్ని కలిగిస్తాయని తెలియజేసారు. డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐలు శివశంకర్, సైదులు పాల్గొన్నారు.

**కుషాయిగూడలో రోడ్ సేఫ్టీ డే**

**ముద్ర, కుషాయిగూడ:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం కుషాయిగూడలో "రోడ్ సేఫ్టీ దే"ను నిర్వహించారు. కుషాయిగూడ ప్రగతి స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, మానవహారం ఏర్పాటు చేసి రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం కల్పించారు. ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో సానిటరీ సూపర్వైజర్ సుదర్శన్, ఎస్ఎఫ్ఏ లక్ష్మి , శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది.

## ప్రగతి ప్రణాళికలో సమస్యలను గుర్తించాలి

**జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**




**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో బాగంగా మండల స్థాయిలో మండల సభలు ఏర్పాటు చేయాలనీ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ అన్ని పథకాల లబ్దిదారుల నెంబర్లు లిస్టు ఇవ్వాలని, అల్పాహార పథకం, ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమ పథకం, మధ్యాహ్నం బోజన పథకాలపై వివరించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, జడ్ పి సి ఇ ఓ సుదీర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రికల్ వాహనాన్ని పరిశీలించిన కలెక్టర్



**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** ఉండవెల్లి మండలం బొంకూరు గ్రామానికి చెందిన యువకుడు బీచుపల్లి స్వయంగా తయారు చేసిన ఎలక్ట్రికల్ వాహనాన్ని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సోమవారం ఐడిఓసీ వద్ద పరిశీలించారు. ఈ సందర్భంగా బీచుపల్లి ఎలక్ట్రికల్ వాహనాలను తయారు చేసేందుకు పరిశ్రమల శాఖ నుంచి తనకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయించాలని కలెక్టర్ను కోరారు. విధివిధానాలను అనుసరించి వాహనాల తయారీకి సహకారంపై పరిశీలించాలని జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వరగౌడ్ కు తెలిపారు.

## మగ్గం నేసే వారికి జియో ట్యాగ్

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** మగ్గం నేసే వారి మగ్గానికి జియో ట్యాగ్ నెంబరు కల్పించి, వారికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకొవాలని కోరుతున్నారు. గతంలో సభ్యత్వం ఉన్నవాళ్లు వంశపారంపర్యంగా వాళ్లే మార్పిడి చేసుకుంటూ ఇంతవరకు నడుస్తుంది. ఆ విధానానికి ప్రభుత్వం ద్వారా స్వస్తి పలికించి కొత్త జియో ట్యాగ్ నెంబర్ కేటాయించి చేనేత కార్మికులు గా గుర్తించాలని. ప్రతి చేనేత కార్మికునికి చేనేత సహకార సంఘాలలో జియో ట్యాగ్ నెంబర్ కల్పించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు వీలుంటుందని అన్నారు. జిల్లాలో 18 చేనేత సహకార సంఘాలు ఉండగా అల్లంపూర్, రాజోలి. ఐజ. ఆరగిద్ద, గట్టు మాత్రమే వర్కింగ్ లో ఉన్నాయి. 13 చేనేత సంఘాలు వర్కింగ్ లో లేవు. కానీ జిల్లాలో ఉన్న 18 చేనేత సహకార సంఘాలకు సభ్యులకు జియో ట్యాగ్ నెంబర్ కల్పించాలని కోరుతున్నారు.

## ఐదో అంతస్తుపై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

**ముద్ర, కూకట్‌పల్లి:**మద్యానికి బానిసై ఓ వ్యక్తి భవనంపై నుండి దూకి బలవన్మరణానికి పాల్పడిన ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మూసాపేట్ శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన సలాని భీమారావు కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల రమణ బావమరిది మృతి చెందడంతో, ఆ బాధలో అతను విపరీతంగా మద్యం సేవిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం ఒంటిగంటకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాను నివాసముంటున్న భవనం ఐదో అంతస్తు పైనుంచి కిందకు దూకాడు. తీవ్ర గాయాలైన రమణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఎన్నికల కన్వీనర్‌గా మాచిపెద్ది శివకుమార్



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఎన్నికల కన్వీనర్‌గా మాచిపెద్ది శివకుమార్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన బాధ్యతలు స్వీకరించగా పలువురు హార్దిక అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ, తనపై విశ్వాసంతో ఈ బాధ్యతలను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు అమ్రాబాద్ లక్ష్మీనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన సమర్థ నాయకత్వంలో జిల్లా, మండల, టౌన్ స్థాయి ఎన్నికలను బృహత్ కార్యక్రమంగా, త్వరితగతిన, అందరి సహకారంతో నిర్విఘ్నంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని తెలిపారు.అలాగే "ఐక్యతే మన బలం – విజయమే మన లక్ష్యం" అనే నినాదంతో వైశ్యుల ఐక్యత మరింత బలపడేలా పనిచేస్తామని పేర్కొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 14.04.2026
www.mudranews.in | @mudranews



**డాల్ఫిన్లు నీటిలో అద్భుతమైన ఈతగాళ్లు**



గంటకు 30–40 కిమీ వేగంతో ఈద గలవు. సముద్రంలో వేగం గా ప్రయాణించే జంతువులలో ఒకటి.

# శ్రీపాద రావు సేవలు మరువలేనివి

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర న్యూస్, ( ధర్మపురి ):**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో విశిష్ట స్థానాన్ని సంపాదించిన స్వర్గీయ శ్రీపాద రావు సేవలు ఎన్నటికీ మరువలేనివని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలో నిర్వహించిన శ్రీపాదరావు వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని ఘన నివాళులు అర్పించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి మంత్రి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మారుమూల మంథని ప్రాంతంలోని ధన్వాడలో జన్మించిన శ్రీపాద రావు సాధారణ కుటుంబం నుంచి రాజకీయాల్లోకి ఎదిగి ప్రజలకు సేవ చేసిన మహానేత అని కొనియాడారు. గ్రామస్థాయి రాజకీయాల నుంచి తన ప్రయాణాన్ని ప్రారంభించి ధన్వాడ సర్పంచ్‌గా, మంథని సమితి అధ్యక్షుడిగా, అనంతరం మంథని ఎమ్మెల్యేగా ప్రజలకు విశేష సేవలు అందించారని గుర్తుచేశారు. అంతేకాకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించిన సమయంలో సభా పరిపాలనలో తనదైన ముద్ర వేసి, ఆ పదవికి గౌరవం తెచ్చారని పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో శాసనసభ చర్చలు శాంతియుతంగా, సమర్థవంతంగా సాగేవని తెలిపారు. శ్రీపాదరావు వ్యక్తిత్వం గురించి మాట్లాడుతూ ఆయన అందరితో కలిసి మెలిసి ఉండే స్వభావం ఆయన ప్రత్యేకత అన్నారు. రాజకీయ విభే దాలు ఉన్నా వ్యక్తిగతంగా ఎవరికీ విరోధం లేకుండా జీవించిన అజాతశత్రువుగా ఆయ నకు మంచి పేరు వచ్చిందని అభిప్రా యపడ్డారు. ప్రజలతో సన్నిహితంగా మెలిగి, వారి సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించేవారని చెప్పారు.

ఇదే సందర్భంలో ఆయన కుమారుడు, ప్రస్తుత మంత్రి శ్రీధర్ బాబు తన తండ్రి ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ రాజకీయాల్లో రాణిస్తున్నారని తెలిపారు. తండ్రికి తగ్గ తనయుడిగా ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్నారని ప్రశంసించారు. శ్రీపాద రావు వర్ధంతి సందర్భంగా ధర్మపురి ప్రజల తరపున ఆయనకు ఘన నివాళులు అర్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థికి అభినందన




**కోరుట్ల, ముద్ర:**
ఇంటర్ పరీక్షల ఫలితాల్లో కోరుట్ల పట్టణానికి చెందిన గుడిసె హాసిని ఎంపీసీ విభాగంలో 467 మార్కులు సాధించింది. వాసవి గ్రేటర్ క్లబ్ కోరుట్ల ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో క్లబ్ అధ్యక్షుడు ఓజ్జల వెంకటరమణ హాసిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు పడిగల శ్రీనివాస్, ఏ. కృష్ణ కుమార్, ముక్క శ్యాం, ఎం ఎస్ ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## మద్దతు ధరకే అమ్మాలి

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకే మొక్కజొన్న అమ్మకం చేయాలని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ తో పాటు సారంగాపూర్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డుల్లో మొక్క న్న కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## శ్రీపాద రావుకు ఘన నివాళి

**మహాదేవపూర్, ముద్ర:**
మండల కేంద్రంలో సోమవారం మాజీ స్పీకర్ శ్రీపాదరావుకు ఘన నివాళి అర్పించారు. సర్పంచ్ హసీనా భాను అక్బర్ ఖాన్, గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కటకం అశోక్, విలాస్ రావు, చల్లా తిరుపతిరెడ్డి, ఆకుతోట సుధాకర్, రాణి బాయి, వామన్ రావు, వరప్రసాద్, అస్రార్ ఖురేషి, నైయుముద్దీన్, చక్రధర్, రాఘవేంద్ర, జగదీష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయం, మాదిగ కార్యాలయంలో శ్రీపాద విగ్రహాలకు అధికారులు రాజకీయ నాయకులు ఘన నివాళి అర్పించారు. లద్దు వద్ద సమ్మయ్య సమ్మయ్య ముదిరాజ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాళేశ్వరంలో అన్నారం గ్రామంలో పలువురు ప్రజా ప్రతినిధులు నాయకులు వర్ధంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## నూతన తహసీల్దార్ కు సన్మానం

**మహాదేవపూర్, ముద్ర:**
మండలంలో ఇటీవల బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ సత్యనారాయణ స్వామిని జిల్లా తెలంగాణ జాగృతి నాయకుడు పూతల నవీన్ ఆధ్వర్యంలో సన్మానించారు. పూతల కిరణ్, కళ్యాణ్, జనార్ధన్, ప్రశాంత్ పాల్గొన్నారు.

# శ్రీపాద రావు కలలను సాకారం చేస్తాం

**-సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి**




**ముద్ర, కరీంనగర్:**
మాజీ స్పీకర్ శ్రీపాద రావు చూపిన బాటలో నడిచి ఆయన కన్న కలలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. సోమవారం డీసీసీ కార్యాలయంతో పాటు నగరంలోని బస్టాండ్ కూడలి వద్ద శ్రీపాద రావు వర్ధంతిని నిర్వహించారు. డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి హాజరై మాజీ ఎమ్మెల్యేలు కటకం మృత్యుంజయం, ఆరేపల్లి మోహన్, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ ఇతర ముఖ్య నేతలతో కలిసి శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించినారు. అనంతరం బస్టాండ్ కూడలి వద్ద కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి ఏర్పాటు చేసిన కార్యక్రమానికి నేతలు హాజరై శ్రీపాదరావు విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మృ త్యుం జయం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ,మల్లికార్జున రాజేందర్, ఎండీ తాజ్, కర్ర రాజశేఖర్, బానోతు శ్రావణ్ నాయక్, వరాల నరసింగం, పడుశెట్టి భూ మయ్య, వేల్పుల వెంకటేష్, ఆకుల నర్సయ్య, గుమ్మడి రాజకుమార్, పర్వత మల్లేశం, చాడ గొండ బుచ్చి రెడ్డి, సరిల్లా ప్రసాద్, కామెడ్డి రాంరెడ్డి, చర్ల పద్మ, మునిగంటి అని ల్ నిహాలైమ్మద్, వంగల విద్యాసాగర్, సుధా కర్ నాయక్, కుంభాల రాజకుమార్, దిండిగాల మధు, వెన్న రాజ మల్లయ్య, బాకారపు శివయ్య, మూల జైపాల్, కల్వల రామ చందర్, రాచకొండ ప్రభాకర్, రాచర్ల పద్మ, అస్తపురం రమేష్, కామ్ పెల్లి కీర్తి కుమార్, సుదర్శన్, పిట్టల రవి, గంగుల దిలీప్, లైక్, జొన్నల రమేష్, రూపు రెడ్డి శ్రీనివాసరెడ్డి, తోట అంజన్న, హర్ష మల్లేశం, దండి రవీం దర్, పడాల అజయ్, వీర దేవేందర్, కమ్రుద్దీన్ అబ్దుల్ బారి, సుకూర్, షబానా, నాగుల సతీష్, జ్యోతి రెడ్డి, ఖాజా ఖాన్, కిరణ్, మా మిడి సత్యనారాయణ రెడ్డి, శిల్ప, స్వప్నశ్రీ, సద్దాం, ఊరడి లత, ఇమ్రాన్, అనిల్, బత్తిని చంద్రయ్య గౌడ్, ఏజ్రా, జీడి రమేష్, చాంద్, మంద మహేష్, సుంకర గణపతి, మాసూమ్ ఖాన్ సిరాజ్, వాసు, ఊకంటి రవీందర్ రెడ్డి, అష్రాఫ్ పాల్గొన్నారు.

# అరైవ్ అలైవ్ లో భాగస్వాములు కావాలి

**- డీజీపీ బి.శివధర్ రెడ్డి**



**బోథ్, ముద్ర:**
ప్రతీ ఒక్కరు అరైవ్ అలైవ్ లో భాగస్వాములు కావాలని డీజీపీ బి.శివధర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం గుడిహత్నూర్ మండల కేంద్రంలోని ఎస్ కన్వెన్షన్ హాల్ లో జిల్లా వ్యాప్తంగా గల సర్పంచులకు నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన సదస్సులో కలెక్టర్ రాజర్షిషాతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ సర్పంచ్ ల తీర్మానంతోనే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చ న్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ఎస్పీ అఖిల్ మహాజన్, అడిషనల్ ఎస్పీ మౌనిక, శిక్షణ ఐపీఎస్ రాహుల్ పాల్గొన్నారు.

**మాజీ మావోయిస్టులకు ఇళ్ల స్థలాల పంపిణీ..**

మాజీ మావోయిస్టు కొమరం సుశీల ,సక్కుబాయిలకు డీజీపీ ఇళ్ల స్థలాలు అందజేశారు అల్లంపల్లి ఫైరింగ్ ఘటనలో మృతి చెందిన పీసీ జె. ముకుందరావు కుటుంబానికి ఇంటి స్థలం పట్టా పాస్ బుక్ ఆయన భార్యకు అందజేశారు.ఏఆర్ హెచ్సీ దిగంబర్ కుటుంబానికి రూ.10 లక్షలు, శివాజీ, రమణ రెడ్డి కుటుంబ సభ్యులకు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలు కల్పించారు.

# ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**- కలెక్టర్ బి. సత్య ప్రసాద్**




**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**
ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రోడ్డు ప్రమాదాలను నియంత్రించడం, ప్రజల్లో ట్రాఫిక్ నియమాల పట్ల బాధ్యతా భావం పెంపొందించడం లక్ష్యంగా అరైవ్ అలైవ్ ను ఈ నెల 13 నుంచి 18 వరకు జిల్లావ్యాప్తంగా విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం పట్టణంలోని ఓల్డ్ బస్ స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, డీఎస్పీ రఘు చందర్, ఆర్టీఓ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు కరుణాకర్, ఎస్.ఐలు, మున్సిపల్ కౌన్సిలర్లు, విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన రాజకీయ పార్టీ ఆవిర్భావ సభ పోస్టర్ ఆవిష్కరణ



**ముద్ర, కరీంనగర్ :** జాగృతి అధ్యక్షురాలు కవిత నాయకత్వంలో స్థాపించబోతున్న నూతన రాజకీయ పార్టీ ఆవిర్భావ సభ వాల్ పోస్టర్ ను సోమవారం నగరంలోని కోర్టు చౌరస్తా లో జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వాల్ పోస్టర్ ను తెలంగాణ జాగృతి జిల్లా ఎస్సీ విభాగం నాయకులు చంటి శ్రీనివాస్, జంగ అపర్ణ రూపొందించినట్లు తెలిపారు. ఈ నెల 25న కవిత నాయకత్వంలో ఈ రాష్ట్ర భవిష్యత్ ను మార్చే నూతన రాజకీయ పార్టీ ఆవిర్భావ సభను మేడ్చల్ జిల్లా మునిరాబాద్ లోని అద్వయ కన్వెన్షన్ లో ఎర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జాగృతి జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల రమేష్, అదివాసి విభాగం జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్, బుడిగె పర్శారం గౌడ్, గాలిపల్లి రత్నాకర్ చారి, సల్మ, కొలిపాక గౌతమి, లంక మనోజ్, దాసరి అంజలి బసవేణి రాజేందర్, కుతాడి రాజిత, కొరిమి పద్మ, కుసుంబా మంజుల, పల్లె శారద పాల్గొన్నారు.

## కాళేశ్వరం ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం



**మహాదేవపూర్, ముద్ర:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం నూతన ఆలయ పాలకమండలి సభ్యులతో ఈవో మహేష్ ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్ గాఅవధాని మోహన్ శర్మ, సభ్యులుగా దొడ్ల అశోక్, కుంభం పద్మ, అడ్డూరి శ్రీధర్ రావు, బీసుల నరసయ్య, గంధెసిరి సత్యనారాయణ, మంచినీళ్ల దుర్గయ్య, సుంకరి సీతయ్య, జలవంచ సీతారాం, కాటం సత్తయ్య, దేవుడా శ్యాం సుందర్, ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఆలయ ఉప ప్రధాన అర్చకులు పనగంటి ఫణింద్రశర్మలు ప్రమాణ స్వీకారం చేశారు.

## ఇంటర్ ఫలితాల్లో ఆల్ఫోర్స్ హవా




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో నిర్మల్ ఆల్ఫోర్స్ విద్యార్థులు సత్తా చాటారు. ఎంపీసీ మొదటి సంవత్సర ఫలితాల్లో జి.అక్షర, డి. వినీష 469 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమంగా నిలిచారు. బీపీసీ లో మొదటి సంవత్సరం ఖాన్సా అలియా, ఎస్.జాగృతి, ఏ. హర్షిత 439 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం పొందారు. మీరాబ్ ఇఫ్తెక్వార్, హజేరా కునైన్ 438 మార్కులు సాధించారు. రెండో సంవత్సరం బైపీసీ లో నబేలా తహ్రీమ్, కె. హారిక 995, యస్.సారిక పాటిల్, సామా ఫిర్దోస్ – 993 మార్కులు సాధించారు. ఎంపీసీ విభాగంలో ఎస్.శివాని, కె. త్రిపుర 994 మార్కులతో రాష్ట్ర స్థాయిలో నిర్మల్ ను అగ్రగామిగా నిలిపారు. ఈ నేపథ్యంలో విద్యార్థులను కళాశాల చైర్మన్ డా. వి. నరేందర్ రెడ్డి అభినందించారు.

## అంత్య పుష్కర పనులు పూర్తి చేయాలి

**మహాదేవపూర్, ముద్ర:** కాళేశ్వరంలో మే 21 నుంచి జూన్ 1 వరకు కాళేశ్వరంలో నిర్వహించనున్న సరస్వతి అంత్య పుష్కరాలు పనులు పూర్తి చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ అధికారులను కోరారు. సోమవారం సచివాలయం నుండి దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ధార్మిక సలహాదారు గోవింద హరి, ఆర్కిటెక్చర్ సూర్యనారాయణతో కలిసి పుష్కరాల పనులపై వీడియో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సరస్వతి ఆది పుష్కరాల సందర్భంగా మొదలు పెట్టిన పెండింగ్ పనుల పురోగతిపై వివరాలు అడిగారు.తాత్కాలిక ప్రాతిపదికన చేపట్టబోయే పనులు 15 రోజుల ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. టెండర్లు పూర్తి అయిన పనులకు నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ కు సూచించారు. సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయ లక్ష్మితో పాటు అన్ని ఇంజినీరింగ్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

**కోరుట్ల, ముద్ర:** ఎస్పీ, కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం కథలాపూర్ మండలం తాండ్రియాల గ్రామంలో "అరైవ్ అలైవ్"లో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బిటి రోడ్లు, స్థానిక రహదారులపై బ్లాక్ స్పాట్ లు, ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నివారణకు సమష్టిగా అవసరమైన నివారణ చర్యలు చేపట్టారు. ఎస్సై రవి కిరణ్ , ఎ పీడీవో శంకర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రవి, ఆర్అండ్‌బీ, ఆరోగ్యశాఖల అధికారులు, గ్రామ పంచాయతీ సర్పంచ్ జంగ శివాని రంజిత్, ఉపసర్పంచ్ అల్లూరి జనార్ధన్ రెడ్డి, వార్డ్ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పండిట్ దీన్ దయాళ్ మానవతా వాది

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ గొప్ప మానవతా వాది అని, ఆయన సిద్ధాంతాలు ఆచరణీయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రారావు అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్మల్ నియోజకవర్గ మండలాల "పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్" కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ గారి “ఏకాత్మ మానవతావాదం” సిద్ధాంతం మనకు మార్గదర్శకమన్నారు. వ్యక్తి నుంచి సమాజం, సమాజం నుంచి దేశం వరకు సమగ్ర అభివృద్ధి సాధించాలనే ఆలోచనతో ప్రతి కార్యకర్త పని చేయాలని పేర్కొన్నారు. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, వక్తలుగా బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, జిల్లా ఇంచార్జి గోపిడి స్రవంతి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లా ఇంద్రకరణ్ రెడ్డి , మేడిసెమ్మే రాజు పాల్గొన్నారు.

### డాల్ఫిన్లు మాంసాహారులు

చేపలు, స్క్విడ్‌లను తింటాయి. వేటలో సమూహంగా వ్యూహాలు ఉపయోగిస్తాయి.



## వైభవంగా శ్రీస్వామివారికి లక్ష పుష్పార్చన



**ముద్ర, యాదగిరిగుట్ట:**

ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో సోమవారం ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని నిత్య పూజల అనంతరం అర్చకులు వైభవంగా లక్ష పుష్పార్చన నిర్వహించారు. స్వామి అమ్మవార్లను బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి వివిధ రకాల పూలతో లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సురేంద్ర చార్యులు, ఉప ప్రధాన అర్చకులు శ్రీధర్చార్యులు, అనిల్ కుమార్ చార్యులు, భక్తులు పాల్గొన్నారు.

# రహదారి భద్రతను పాటిస్తే సురక్షిత ప్రయాణం






- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:**

ప్రతి ఒక్కరూ రహదారి భద్రతను పాటిస్తే సురక్షిత ప్రయా ణం చేయవచ్చని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం భువనగిరి కేంద్రం లోని 35 వార్డులో "అరైవ్ – అలైవ్" కార్యక్రమానికి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, అడిషనల్ డీజీపి మహేష్ భగవత్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఎస్పీ అక్షాంశ్ యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, మున్సిపల్ చైర్పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్, అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ, డీఎస్పీ రవీందర్, ట్రాఫిక్ డీస్పీ ప్రభాకర్ రెడ్డి, జిల్లా రవాణా అధికారి సాయికృష్ణ, ఎం.రమేష్ , ఇన్స్పెక్టర్ భువనగిరి టౌన్ పోలీస్ స్టేషన్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న "అరైవ్ – అలైవ్" కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్ వినియోగించడం వంటి అలవాట్లేనని అన్నారు. అనంతరం జగదేవ్ పూర్ లో గల రోడ్డుగుంతలను ఎంపీ, అడిషనల్ డీజీపీ మట్టి పోసి గుంతలను పూడ్చారు. రోడ్డు పై వస్తున్న వాహనదారున్ని ఆపి హెల్మెట్ డ్రైవింగ్ గురించి అవగాహన కల్పించారు.

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ నిర్లక్ష్యం, అధిక వేగం, హెల్మెట్ వినియోగ లేకపోవడం వల్ల అమూల్యమైన ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు,వార్డ్ మెంబర్ లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి..

**ముద్ర, యాదగిరిగుట్ట:**

ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. యాదగిరిగుట్ట మండలం సైదాపూర్ గ్రామంలో 99రోజుల ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆరైవ్ ఆలైవ్ రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచిం చారు. అనంతరం సైదాపురం ఉపసర్పంచ్ దుంబాల వెంకటరెడ్డి, బీర్ల శంకర్ ఆధ్వర్యంలో ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు, టౌన్ సీఐ భాస్కర్, రూరల్ సీఐ శంకర్ గౌడ్, ట్రాఫిక్ సీఐ కృష్ణ, తహసీల్దార్ గణేష్ నాయక్, ఎంపీడీవో నవీన్ కుమార్, సర్పంచ్ రోజా దర్శన్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే మందుల సామెల్
- 265 మందికి చెక్కుల పంపిణీ

**ముద్ర, తుంగతుర్తి:**



మహిళలకు సమాన హక్కులు, ఆర్థిక స్వావలంబన, సామాజిక గౌరవం కల్పించాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మందుల సామెల్ అన్నారు. సోమవారం నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 5 మండలాలకు చెందిన 265 మంది లబ్ధిదారులకు రూ.2,65,30,740ల విలువగల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్ తో కలిసి ఎమ్మెల్యే సామెల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి తమ ఆడపడుచు పెళ్లి చేసి ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం పేరుతో వారికి అండగా ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణలో మహిళల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. .ఈ కార్యక్రమంలో, తుంగతుర్తి సర్పంచ్ మల్లెపాక సాయిబాబు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తిరుమల ప్రగడ అనురాధ కిషన్ రావు తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, సింగల్ విండో మాజీ చైర్మన్ గుడిపాటి సైదులు, వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంగరీ గోవర్ధన్, ఐదు మండలాల తహసిల్దార్ లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, సర్పంచులు, రెవెన్యూ సిబ్బంది, పచ్చిపాల సుమతి, దాయం ఝాన్సీ రాజి రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థిని అభినందించిన ఎమ్మెల్యే

**ముద్ర, తుంగతుర్తి:**



ఆదివారం వెలువడిన ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు (991/1000) సాధించిన కాంగ్రెస్ పార్టీ నాయకురాలు పచ్చిపాల వెంకన్న–సుమతి దంపతుల కూతురు వైష్ణవిని ఎమ్మెల్యే మందుల సామెల్, తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్ తో కలిసి తుంగతుర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆమెకు అభినందనలు తెలియజేస్తూ రూ.10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం విద్యార్థుల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ఇలాంటి ప్రతిభావంతులను ప్రోత్సహిం చడం మన బాధ్యత అని తెలిపారు. విద్యార్థిని కృషిని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి

**ముద్ర, యాదాద్రి భువనగిరి:**



విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని శ్రీవైష్ణవి జూనియర్ కళాశాల ఛైర్మెన్, కరస్పాండెంట్ పడాల శ్రీనివాస్ అన్నారు. ఇంటర్మీడియట్ ఫలితాలలో జిల్లా మొదటి, స్టేట్ ర్యాంకులతో శ్రీవైష్ణవి కళాశాల ప్రభంజనం సృష్టించగా సోమవారం కళాశాల ప్రాంగణంలో విద్యార్థుల అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, డైరెక్టర్ మధర మల్లేషం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు

## శ్రీ లక్ష్మి నరసింహ స్వామి డిగ్రీ కళాశాలలో అంబేద్కర్ జయంతి

**ముద్ర, యాదాద్రి భువనగిరి:**




శ్రీ లక్ష్మి నరసింహ స్వామి డిగ్రీ కళాశాలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్, టూ, త్రీ విభాగాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి రమేష్ హాజరై అంబేద్కర్ చేసిన సేవలను కొనియాడారు. ఆయన బాల్యం నుంచి ఎదుర్కొన్న కష్టాలను మానవజాతికి జరుగుతున్న అన్యాయాలను, అసమానతలు తొలగించి సమసమాజ స్థాపన చేయాలని ఆయన పడ్డ కష్టాలను, రాజ్యాంగాన్ని రచించడంలో ఆయన చూపిన ప్రతిభ పాటవాలను భారతజాతి మొత్తం గుర్తుంచుకోవాలని అన్నారు. ప్రతి ఏటా ఘనంగా ఇటువంటి సంస్మరణ సభలు నిర్వహించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగాల అధిపతులు కే. బాలరాజు, టీ. రామకృష్ణ, అత్తరు ఫరీన్లు, డాక్టర్ బి జగనాథ్, డాక్టర్ సత్యనారాయణ, సుధా, రవీందర్, లెక్చరర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా కళాకారులకు గుర్తింపు కార్డులివ్వాలి

- కలెక్టరేట్ ఎదుట ధర్నా

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:**



అర్హులైన ప్రజా కళాకారులకు గుర్తింపు కార్డులు, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్ద శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజానాట్య మండలి కళాకారులు అనేక సంవత్సరాలుగా గుర్తింపు లేకుండా, సరైన పారితోషికం లేకుండా, సామాజిక భద్రత లేకుండా దయనీయ పరిస్థితుల్లో జీవిస్తున్నారని, కళాకారుల కష్టాలను పట్టించుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబించడం తగదన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో కళాకారులను ఉపయోగించుకుంటూ, తరువాత వారికి కనీస గౌరవ వేతనం కూడా ఇవ్వకపోవడం అన్యాయమని, వెంటనే ప్రతి కళాకారులకు గుర్తింపు కార్డు జారీ చేసి, కనీస పారితోషికాన్ని చట్టబద్ధం చేయాలన్నారు. ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, పెన్షన్ వంటి భద్రతా పథకాలు తక్షణమే అమలు చేయాలని, జిల్లా కేంద్రంలో సాంస్కృతిక భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు, ప్రధా న కార్యదర్శి భూషిపాక నర్సింహా, చెక్క వెంకటేష్, చిరుర్ల లింగం, మూల పోచ య్య, పిట్టల శంకర్, కట్ల యాదగిరి, సోమ నరసయ్య, ఇంజ హేమలత, శ్రీనివాస్, రాజప్ప, మల్లేశం, సరిత, దుప్పెల్లి చౌదరి, సుగుణమ్మ, లక్ష్మయ్య, మల్లేశం, అన్నెమైన వెంకటేష్ పాల్గొన్నారు.



### ప్రజావాణికి 65 అర్జీలు

**ముద్ర, యాదాద్రి భువనగిరి :**

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 65 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డితో కలిసి ఆయన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ శాఖ 46, పిడి హౌసింగ్ 4, సర్వే ల్యాండ్ 4, జిల్లా పంచాయతీ 3, శిశు సంక్షేమం 2, జిల్లా గ్రామీణ అభివృద్ధి 2, సివిల్ సప్లై, కో–ఆపరేటివ్, డిపిఆర్ఓ, మార్కెటింగ్ శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, జెడ్పీ సీఈఓ శోభారాణి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## 'నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇవ్వాలి'

**ముద్ర, మోత్కూరు:**



నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. సోమవారం సమస్యలపై పోరుబాటలో కార్యక్రమంలో భాగంగా మండలంలోని పాలడుగు గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైనా కట్టుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పేదల ఇండ్లను సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుపేదల సోంతింటి కళ ఇందిరమ్మ ఇండ్లతో నిజం చేస్తామని ప్రభుత్వం పదే పదే చెప్తున్నప్పటికి అమలులో నీరు కారుస్తుందని విమర్శించ్చారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఉన్న నిబంధనలతో నిరుపేదలు ఇండ్లు నిర్మించుకోలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ప్రభుత్వం విధించిన నిబంధనలతో గ్రామ కమిటీలు కూడ ఆర్థికంగా ఉండి ఇల్లు నిర్మించుకోగలిగిన వారికే ఇందిరమ్మ ఇండ్లను కేటాయించే పరిస్తితి ఉందన్నారు. ప్రభుత్వ ఆశయం, పేదోళ్ల సోంతింటి కల నెరవేరాలంటే ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో నిబంధనలు పూర్తిగా తొలగించి, ఆర్థిక స్థోమత లేని నిరుపేదలకు ప్రభుత్వమే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల కమిటీ సభ్యుడు దడిపల్లి ప్రభాకర్, శాఖ కార్యదర్శి పిట్టల చంద్రయ్య, చింతకింది సోమరాజు, సైదులు, బరిగేల నారాయణ, ముక్కిడి నర్సింహా, బరిగేల సూర్యనారాయణ, ముక్కాముల స్వామి తదితరులు పాల్గొన్నారు.

### మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

**ముద్ర, మోత్కూర్:**

మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని కొత్త బస్టాండ్ లో నిరుపేద కుటుంబానికి చెందిన వల్లమల పెంటమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. మన మోత్కూర్ వాట్సప్ గ్రూప్ సభ్యులు దాతల సహకారంతో సేకరించిన రూ.16,500ల చెక్కును సోమవారం కౌన్సిలర్ కూర్మిళ్ల ప్రమీల రాములు, ఓ యూ జేఏసీ మాజీ చైర్మన్ మర్రి అనిల్ కుమార్ ల చేతుల మీదుగా మృతురాలి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న, మాజీ ఎంపీటీసీ, వార్డు సభ్యులు ముద్దం జయశ్రీ, ఎడ్ల శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు మొగుల్లపల్లి సోమయ్య, వాట్సప్ గ్రూప్ ప్రతినిధులు ధబ్బేటి సోంబాబు, మొరిగాల శ్రీనివాస్, కారుపోతుల శ్రీనివాస్, గుంటి దేవా, బోడ బాబు రావ్, కుటుంబ సభ్యులు నర్సయ్య, మత్స్యగిరి తదితరులు పాల్గొన్నారు.



## మహిళలు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా అదనపు కలెక్టర్ కె. సీతారామారావు

**ముద్ర, సూర్యాపేట:**



రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళా సంఘాలకు అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ కె. సీతారామారావు తెలిపారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సెర్ప్, గృహనిర్మాణ శాఖ సంయుక్తంగా నేషనల్ అకాడమి ఆఫ్ కన్ స్ట్రక్షన్స్ (నాక్) ద్వారా ఇచ్చిన శిక్షణలో పాల్గొన్న లబ్దిదారులకు అదనపు కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికేట్లను అందించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ గృహ నిర్మాణాల్లో సభ్యులను భాగస్వాములుగా చేస్తూ వారికి అదనపు జీవనోపాధిని కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు వివరించారు. సెర్ప్ ద్వారా సెంట్రింగ్ పనులలో అవగాహన కలిగిన మహిళా సంఘాల కుటుంబ సభ్యలను గుర్తించి వారికి నాక్ ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన 30 మంది లబ్దిదారులకు ప్రభుత్వ సహకారంతో బ్యాంకు ఋణాలను అందజేసి సెంట్రింగ్ యూనిట్ ఏర్పాటు చేయించి, గృహనిర్మాణ శాఖ ద్వారా వారికి ఉపాది అవకాశలు కల్పించడమే లమని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ అదనపు పథక సంచాలకులు సురేష్, హౌసింగ్ ఎ.ఇ, అబ్దుల్, నాక్ సెంటర్ అడిషినల్ డైరెక్టర్ చింతమల్ల రమేష్, డీపీఎం అరుణ్ కుమార్, ఏపీఎం నగేష్ పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
14.04.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



డాల్ఫిన్లు మంచి చూపు.. వినికిడి



నీటిలోనూ, బయటా కూడా స్పష్టంగా చూడగలవు. శబ్దాలను చాలా సున్నితంగా గ్రహిస్తాయి.



# జనగణన సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్ల నియామకం పూర్తి

- కలెక్టర్ ప్రతిమా సింగ్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

జిల్లాలో జరగనున్న జనగణన కార్యక్రమానికి సంబంధించి సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్ల నియామక ప్రక్రియను పూర్తిచేసినట్లు కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. హైదరాబాద్ నుంచి కులగణన సంచాలకులు భారతి హోళికేరి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 26 నుంచి మే 10వ తేదీ వరకు నిర్వహించనున్న సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ముఖ్యంగా ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 1,406 మంది ఎన్యూమరేటర్లు, 248 మంది సూపర్వైజర్లను నియమించామని వివరించారు. జనగణన సూపరింటెండెంట్ గఫార్, ఈడీఎం సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# వరిగుంతంలో పురాతన తెలుగు శాసనం గుర్తింపు



**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మెదక్ జిల్లా కుల్చారం మండలం వరిగుంతం గ్రామంలో నల్లరాతిపై చెక్కిన తెలుగు శాసనాన్ని బుర్ర సంతోష్ గుర్తించారు. దీనిని పరిశీలించిన 'కొత్త తెలంగాణ చరిత్ర బృందం' కన్వీనర్ రామోజు హరగోపాల్, ఇది 18వ శతాబ్దానికి చెందిన తెలుగు శాసనమని తెలిపారు. ఎర్రయప్రోలు పేరుమీద చేసిన దానం గురించి ఇందులో ప్రస్తావన ఉన్నట్లు వెల్లడించారు. గ్రామ పురాతన చరిత్రను తెలిపే ఇలాంటి శాసనాలు, విగ్రహాలను కాపాడుకోవాలని, తద్వారా తరువాతి తరాలకు మన చరిత్ర గొప్పతనం తెలియజేయవచ్చని బుర్ర సంతోష్ పిలుపునిచ్చారు. మరుగునపడిన శిల్పాలను ఏదైనా ఆలయం లేదా గ్రామపంచాయతీలో భద్రపరిచి సంరక్షించాలని సూచించారు. ఈ శాసనం 1782 మే 18న, అప్పటి హైదరాబాద్ సంస్థానం (దక్కన్ సుబా) పరిపాలకుడు నిజాం అసఫ్ జా మీర్ నిజాం అలీ ఖాన్ కాలంలో వేయబడిందని తెలిపారు.

# ఫీజు రీయింబర్స్ మెంట్ పథకం ఎత్తివేతకు కుట్ర: ఏబీవీపీ



**ముద్ర న్యూస్ :**

ఏబీవీపీ తెలంగాణ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను విడుదల చేయాలని యూనివర్సిటీ మెయిన్ గేట్ ఎదుట ఏబీవీపీ నాయకులు డిచ్‌పల్లిలో నిరాహార దీక్ష చేశారు. పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నతవిద్యను ఉచితంగా అందించాలనే సదుద్దేశంతో తీసుకొచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర పన్నుతుందని, దీనిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర విశ్వవిద్యాలయాల కన్వీనర్ బి. శివ తెలిపారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పేద విద్యార్థులకు ఉన్నత విద్య దూరం అయ్యే పరిస్థితి వచ్చిందని శివ ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై ఆధారపడి ఏటా 14 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం విద్యార్థులను నయవంచనకు గురిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అమృత్ చారి, యూనివర్సిటీ అధ్యక్ష కార్యదర్శులు సమీర్ పృథ్వి, ప్రాంత వనవాసి అశోక్, ఉపాధ్యక్షుడు మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్మూర్‌లో జూద గృహంపై దాడి..

- పోలీసుల అదుపులో పలువురు నేతలు

**ముద్ర న్యూస్ :**

ఆర్మూర్‌లో జూద గృహంపై సీసీఎస్ పోలీసులు దాడులు నిర్వహించారు. జూదం ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో బీజేపీ నేత, భైంసా మున్సిపల్ ఛైర్మన్ దత్తాద్రి, ఆర్మూర్ కాంగ్రెస్ కౌన్సిలర్ రవి గౌడ్, పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉన్నట్లు సమాచారం. వీరి నుంచి రూ.1.79లక్షలు, రెండు కార్లు, ఆరు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# ఆర్టిజన్ కార్మికులతో చర్చలు జరపాలి

- న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి
- లేకుంటే వారితో కలిసి బీఆర్ఎస్ ఉద్యమం చేపడుతుంది
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**







సమ్మె చేస్తున్న ఆర్టిజన్ కార్మికులను పిలిచి ప్రభుత్వం వెంటనే చర్చలు జరపాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. సిద్దిపేట ముస్తాబాద్ చౌరస్తా విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సమ్మెకు సంఘీభావం తెలిపి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని వర్గాలకు హామీలు ఇచ్చిన ప్రభుత్వం రెండున్నర ఏళ్లలోనూ వాటిని అమలు చేయడం లేదని మండిపడ్డారు. 26 వేల మంది ఆర్టిజన్ కార్మికులకు ఆర్డినెన్స్ ద్వారా గుర్తింపు ఇచ్చి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వేతనాలు పెంచారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ఆర్టిజన్ ఎంప్లాయీస్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. అంగన్వాడీలకు రూ.18 వేల వేతనం, రిటైర్మెంట్ సమయంలో రూ.2 లక్షలు ఇస్తామని చెప్పి, ఇప్పుడు అడిగితే పోలీసులతో దాడులు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వానికి ఎలాంటి స్పందన లేదని, ఇది ప్రజా పాలన కాదని, రాక్షస పాలన కొనసాగుతోందని విమర్శించారు. బట్టి విక్రమార్క పాదయాత్రలో పెద్ద పెద్ద హామీలు ఇచ్చినా, ఇప్పటి వరకు ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ప్రజాభవన్‌లోకి వెళ్లిన తర్వాత ఆయన వైఖరి మారిందని అన్నారు. అండర్‌గ్రౌండ్ పనుల ద్వారా కమిషన్లు తీసుకునే పనిలో ప్రభుత్వం ఉందని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో ట్రాన్స్‌ఫర్లు సులభంగా జరిగాయని, ప్రస్తుతం 24 గంటల కరెంటు ఇస్తామని చెప్పినా 12 గంటలు కూడా సరిగా అందడం లేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వెంటనే ఆర్టిజన్ ఎంప్లాయీస్‌ను చర్చలకు పిలవాలని, హైకోర్టు స్టే వచ్చినప్పటికీ కేసీఆర్ ఇచ్చిన హామీలను నిలబెట్టాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ఆర్టిజన్ కార్మికులతో కలిసి బీఆర్ఎస్ పార్టీ ప్రత్యక్ష పోరాటం చేపడుతుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని స్పష్టం చేశారు.

## ఆర్టిజన్ సమ్మెకు శశిధర్ రెడ్డి మద్దతు

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

మెదక్ జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న ఆర్టిజన్ కార్మికుల సమ్మెకు టీజీ ఈఆర్సీ సలహా సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్టిజన్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం, యాజమాన్యాలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఆరు రోజులుగా సమ్మె కొనసాగుతున్నప్పటికీ యాజమాన్యాలు పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. ఆర్టిజన్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం శశిధర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు ఏపీ ఎస్ఈబీ రూల్స్‌ను యథాతథంగా అమలు చేయాలని కోరారు. ఇంకా ఆలస్యం చేయకుండా ప్రభుత్వం వెంటనే చర్చలకు పిలిచి, ఆర్టిజన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని పట్లోళ్ల శశిధర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, ఆర్టిజన్ కార్మికులు నాగరాజు, శరత్, పృథ్వి, ప్రతాపరెడ్డి, చారి, శ్రీశైలం, ప్రణీత, స్వప్న, నాగమణి, మానస, సుమలత తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

- కలెక్టర్ ప్రతిమా సింగ్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి క్షేమంగా తిరిగి ఇంటికి చేరాలంటే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. సోమవారం 'అరైవ్-అలైవ్' కార్యక్రమం భాగంగా నిజాంపేట మండలం నందగోకుల్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం వంటి అలవాట్లు ప్రమాదాలకు ప్రధాన కారణాలని తెలిపారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి వాహనం నడపకూడదని హెచ్చరించారు. ఎస్పీ డీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ప్రతి ఏడాది సుమారు 1.70 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్నారని, తెలంగాణలో 70 వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెదక్ జిల్లాలో సంవత్సరానికి హత్యలు, అత్యాచారాలు కలిపి 30 ఘటనలు నమోదవుతుంటే, రోడ్డు ప్రమాదాల్లో 350 మంది మరణిస్తున్నారని తెలిపారు. రోడ్డు భద్రత నియమాలు పాటించకపోవడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, సీట్‌బెల్ట్ ధరించకపోవడం వంటి కారణాల వల్ల చాలామంది ప్రాణాలు కోల్పోయి కుటుంబాలకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. నందగోకుల్ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి రోడ్డు భద్రత నియమాలు పాటించాలని కోరారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. హెల్మెట్ వినియోగంపై ఒక కానిస్టేబుల్ చేసిన మిమిక్రీ అందర్నీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో నిజాంపేట తహసీల్దార్ శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి దేవకుమార్, సర్పంచ్ పాతూరు భాను, ఎంపీడీవో రాజిరెడ్డి, డీఎస్పీ నరేందర్ గౌడ్, సీఐ వెంకటరాజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నో హెల్మెట్.. నో ఎంట్రీ @ నందగోకుల్

- కలెక్టర్ ప్రతిమా సింగ్ సమక్షంలో తీర్మానం

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లాలోని 492 గ్రామపంచాయతీలలో గ్రామసభల ద్వారా 'అరైవ్-అలైవ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ క్రమంలో నిజాంపేట మండలం నందగోకుల్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు 'నో హెల్మెట్... నో ఎంట్రీ @ నందగోకుల్' అనే అంశంపై ఏకగ్రీవంగా తీర్మానం చేసి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. హెల్మెట్లు ధరించి ద్విచక్ర వాహన ర్యాలీ కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల ప్రాణ రక్షణ ధ్యేయంగా నందగోకుల్ గ్రామస్తులు తీసుకున్న నిర్ణయం అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లా ప్రజలందరూ నందగోకుల్ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని అన్ని గ్రామపంచాయతీలలో 'నో హెల్మెట్... నో ఎంట్రీ' కార్యక్రమాన్ని అమలు చేయాలని సూచించారు.







# బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

**ముద్ర న్యూస్ :**

జిల్లాలోని బీర్కూర్‌కు చెందిన యువకుడు ఆసిఫ్ నాలుగు రోజుల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక కాలు విరిగింది. విషయం తెలుసుకున్న మాజీ జడ్పీటీసీ సభ్యుడు ద్రోణవల్లి సతీష్ సోమవారం బాధితుడి ఇంటికెళ్లి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా బీర్కూర్ సర్పంచ్ అరిగే ధర్మతేజ, వార్డు సభ్యులు, ఇతరులు పాల్గొన్నారు. అదేవిధంగా రైతునగర్‌కు చెందిన శ్రీనివాస్ మూడు రోజుల కిందట నీటి కుంటలో పడి మృతి చెందారు. వారి కుటుంబానికి ఆ గ్రామ మాజీ సర్పంచి నాగేశ్వర్ రావు రూ.8,500 ఆర్థిక సాయం అందించారు.

# బీర్కూర్‌లో బడిబాట

**ముద్ర న్యూస్ :**

బీర్కూర్ మండల కేంద్రంలో సోమవారం పీఎంశ్రీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో 11, 12 వార్డుల్లో ఇంటింటికి తిరుగుతూ తమ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు కల్పిస్తున్న ఇతరత్రా సదుపాయాలను తల్లిదండ్రులకు వివరించారు. ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు అన్ని రకాల వసతులు ఉన్నాయని ఉపాధ్యాయులు తెలిపారు. పాఠశాలలో చేరే విద్యార్థుల పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జయశ్రీ, గంగామణి, భరత్, దశరత్, సోమేశ్వర్, ప్రేమలత, సింధు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

**ముద్ర న్యూస్ :**

నిజామాబాద్ పట్టణంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ, నగర మేయర్ ఉమారాణి పాల్గొని అర్బన్ నియోజకవర్గంలోని 404 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. మధ్యవర్తులకు అవకాశం లేకుండా పారదర్శకంగా కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్నట్లు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ప్రభుత్వానికి ఆర్థికంగా ఎంత ఇబ్బంది ఉన్నా పేద ప్రజలను ఆదుకునేందుకు ఈ చెక్కులను అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు నేతలు, అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
14.04.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**డాల్ఫిన్లకు మంచి చూపు.. వినికిడి**

నీటిలోనూ, బయటా కూడా స్పష్టంగా చూడగలవు. శబ్దాలను చాలా సున్నితంగా గ్రహిస్తాయి.



## రేవంత్ ప్రతిపాదనలు రాజ్యాంగ విరుద్ధం

- డీలిమిటేషన్‌పై సీఎం తీరు సరికాదు
- కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శలు

**ముద్ర, కరీంనగర్:**



డీలిమిటేషన్‌పై సీఎం రేవంత్ రెడ్డి కేంద్రానికి చేసిన ప్రతిపాదనలు రాజ్యాంగ విరుద్ధమని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. అవి అట్టడుగు వర్గాల ప్రయోజనాలను దెబ్బ తీసేలా ఉన్నాయని మండిపడ్డారు. అత్యధిక ఆదాయం ఇచ్చే ప్రాంతాలకే ఎక్కువ సీట్లు ఇవ్వాలన్న రేవంత్ రెడ్డి వాదనను బండి సంజయ్ తప్పుబట్టారు. సోమవారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. “రేవంత్ రెడ్డి ప్రతిపాదన నిజమైతే హైదరాబాద్‌కే అన్ని సీట్లు ఇవ్వాలా? మరి ఆయన పుట్టిన పాలమూరుకు, వెనుకబడిన ఆదిలాబాద్ వంటి జిల్లాలకు సీట్లు పెంచాల్సిన అవసరం లేదా?” అని ప్రశ్నించారు. కాంగ్రెస్ హైకమాండ్‌కు మూటలు పంపి, ఇప్పుడు డబ్బు ప్రాతిపదికనే సిద్ధాంతాలు రచిస్తున్నారా అని ఎద్దేవా చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ పునాదులను కాంగ్రెస్ దెబ్బతీయాలని చూస్తోందని విమర్శించారు. అంబేద్కర్ జయంతికి ముందే ఆయన ఆశయాలను దెబ్బతీసేలా రేవంత్ వ్యాఖ్యలు ఉన్నాయని పేర్కొన్నారు. అంబేద్కర్ బతికుంటే కాంగ్రెస్‌ను దేశం నుంచి బహిష్కరించేవారని అన్నారు. డబ్బుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ అభివృద్ధి ఫలాలు అందాలన్నదే బీజేపీ ఆశయమని బండి సంజయ్ తెలిపారు. జనాభాతో సంబంధం లేకుండా ప్రతి రాష్ట్రంలో 50 శాతం సీట్లు పెంచాలని నిర్ణయించిన ఘనత ప్రధాని మోదీదేనన్నారు. కాంగ్రెస్ ముమ్మాటికీ మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకమని ఆరోపించారు. ఐదు దశాబ్దాల పాలనలో ఎందుకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వలేదని ప్రశ్నించారు. గతంలో పార్లమెంట్‌లో బిల్లు కాపీలు చించివేసిన ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీలతో కాంగ్రెస్ ఇప్పటికీ కలిసి ఉందని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ నైజాన్ని బయటపెట్టాయని, విభజన రాజకీయాలు మానుకొని ఇప్పటికైనా నిజం మాట్లాడాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# భూ పరిపాలనకు కొత్త దిక్సూచి భూభారతి

- చారిత్రాత్మక చట్టానికి రేపటితో ఏడాది పూర్తి
- పాత సర్వే పద్ధతులకు స్వస్తి - రోవర్స్‌తో సర్వేలు
- ప్రతి సర్వే నంబర్‌కు ‘భూధార్’ : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో కుప్పకూలిన రెవెన్యూ వ్యవస్థను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పునర్నిర్మిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భూహక్కుల పరిరక్షణ, పారదర్శకత, అవినీతి రహిత సేవలను సామాన్యుడికి సులభంగా అందించే దిశగా గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టం తెలంగాణ చరిత్రలో కీలక సంస్కరణగా నిలుస్తోందన్నారు. ఈ నెల 14తో భూభారతి చట్టం అమలులోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇది కేవలం ఒక చట్టానికి ఏడాది పూర్తయిన సందర్భం మాత్రమే కాదని, తెలంగాణలో భూహక్కుల రక్షణకు కొత్త దశకు నాంది పలికిన రోజని పేర్కొన్నారు. భూభారతి చట్టానికి ముందు, తరువాత ఉన్న పరిస్థితులపై అధికారులతో చర్చించారు. ఈ చట్టం అమలులోకి రాకముందు ధరణి పోర్టల్ వల్ల ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను మంత్రి గుర్తుచేశారు. పారదర్శకత, బాధ్యతాయుతం, వేగం అనే మూడు సూత్రాలతో రెవెన్యూ వ్యవస్థను ప్రజలకు చేరువ చేశామని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో సరైన విధివిధానాలు లేకుండా తీసుకొచ్చిన 2020 ఆర్వోఆర్ చట్టం, ధరణి పోర్టల్ కారణంగా లక్షలాది మంది తమ భూముల హక్కుల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. భూమి తమదే అయినప్పటికీ హక్కులు నిరూపించుకోవడానికి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని వివరించారు. గత ఏడాది ఏప్రిల్ 14న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా భూభారతి పోర్టల్‌ను ప్రారంభించామని తెలిపారు. ఈ 12 నెలల్లో భూభారతి పోర్టల్ పాత సమస్యలను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. ఏడాదిలోపే 5.20 కోట్లకు పైగా సందర్శనలు నమోదయ్యాయని, సుమారు 67 లక్షల మంది లాగిన్ అయ్యారని తెలిపారు. రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి ఎన్ఐసీ సహకారంతో రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను ఈ నెల 2 నుంచి ఐదు జిల్లాల ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించామని చెప్పారు. ప్రతి సర్వే నంబర్‌కు భూధార్ నంబర్ కేటాయిస్తూ భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలో నిజాం కాలం నుంచి 378 గ్రామాలకు నక్షాలు లేవని, అందులో ఐదు గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి భూధార్ నంబర్లు కేటాయించామని తెలిపారు. మిగిలిన గ్రామాల్లో ఆధునిక రోవర్స్ సాంకేతికతతో సర్వే పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీగా సర్వేలు నిర్వహించి భూధార్ నంబర్లు కేటాయించనున్నామని తెలిపారు. ఇందుకోసం 5,520 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు లైసెన్సులు జారీ చేసినట్లు చెప్పారు. పాత సర్వే పరికరాలకు స్వస్తి చెప్పి ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని, ఇప్పటికే 411 రోవర్స్ కొనుగోలు చేశామని, త్వరలో మరిన్ని కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. గత ఏడాది నుంచి ఇప్పటి వరకు 3.80 లక్షల పాస్‌బుక్స్ జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు.



## మూసీ అభివృద్ధిలో భాగస్వామ్యం కల్పించాలి

- పునరావాస ప్రతిపాదనలను పరిశీలించాలి
- డిప్యూటీ సీఎం భట్టికి నిర్వాసితుల వినతి

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసి పునర్జీవనం పథకంలో ఇండ్లు, వ్యాపారాలు కోల్పోతున్న తమకు న్యాయం చేయాలని మధు పార్క్ ఏబ్లాక్ నిర్వాసితులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మూడు ప్రతిపాదనలను పరిశీలన కోసం సమర్పించారు. సోమవారం మధ్యాహ్నం మధు పార్క్ రిడ్జ్ ఏబ్లాక్ నిర్వాసితులు హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎంను కలిశారు. మూసి పునర్జీవనం అభివృద్ధి పనులను స్వాగతిస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనులపై తమకు ఎటువంటి అభ్యంతరం లేదని పేర్కొంటూ, అందులో తమను భాగస్వాములను చేయాలని కోరారు. నిర్వాసితుల ప్రతిపాదనలపై డిప్యూటీ సీఎం స్పందిస్తూ, మూడు ప్రతిపాదనలను మానవీయ కోణంలో పరిశీలించి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. మధు పార్క్ రిడ్జ్ ఏబ్లాక్ నిర్వాసితులు సమర్పించిన ప్రతిపాదనలను పరిశీలించి మూసి క్యాబినెట్ సబ్ కమిటీకి నివేదిక ఇవ్వాలని మూసి రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండి నరసింహారెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిలకు ఆదేశించారు. డిప్యూటీ సీఎంకు విజ్ఞాపన పత్రం సమర్పించిన వారిలో మధు పార్క్ రిడ్జ్ ఏబ్లాక్ ప్రెసిడెంట్ డాక్టర్ కె. శ్రీశైలం, సెక్రటరీ డాక్టర్ కరీముల్లా, సలహాదారు సంజయ్ శుక్ల, లీగల్ అడ్వైజర్ ప్రతాపరెడ్డి, జేఏసీ బి.ఎన్. రెడ్డి, ఉపాధ్యక్షుడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్లపై సీఎంకు అవగాహన లేదు

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శ
- పార్లమెంట్ చర్చల్లో అన్ని పార్టీల ఎంపీలకు అవకాశం

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



సీఎం రేవంత్ రెడ్డి మహిళా రిజర్వేషన్లపై అవగాహన లోపంతో మాట్లాడుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో పార్లమెంట్‌లో జరిగే చర్చల్లో అన్ని పార్టీల ఎంపీలు ఈ అంశంపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేయవచ్చని వెల్లడించారు. మహిళా రిజర్వేషన్లపై రాజకీయాలు చేయొద్దని కాంగ్రెస్ నేతలను కోరారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్‌పై సీఎం రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి చేసిన ఎక్స్ పోస్టుపై కిషన్‌రెడ్డి స్పందించారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్ణయం తీసుకున్నారని వివరించారు. దశాబ్దాలుగా దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సూచించిన మహిళల రిజర్వేషన్ల అంశాన్ని ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మహిళలకు రిజర్వేషన్లు తీసుకువస్తుంటే కాంగ్రెస్ నేతలు అనవసర విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో 70 కోట్ల మంది మహిళల గౌరవాన్ని పెంచాలని, వారికి హక్కులు కల్పించాలని ఈ రిజర్వేషన్లు తీసుకువస్తున్నామని తెలిపారు. దక్షిణాదిలోని రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగకుండా మోదీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు.

**డీలిమిటేషన్ చేయాల్సిందే..**

మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలంటే డీలిమిటేషన్ తప్పనిసరిగా చేయాల్సిందేనని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాహుల్ గాంధీ సహా కాంగ్రెస్ నేతలు మహిళా రిజర్వేషన్లకు సహకరించాలని కోరారు. పూర్తిస్థాయి జనగణన (సెన్సస్) పూర్తయ్యేందుకు రెండు సంవత్సరాల సమయం పడుతుందని, మిడిమిడి జ్ఞానంతో వ్యాఖ్యలు చేయవద్దని హితవు పలికారు. వారానికి ఒకసారి ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు వెళ్తున్నారో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక కార్పొరేషన్ పదవి కోసం ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. బీజేపీ విధానం అలాంటిది కాదని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## మహిళా బిల్లుపై రాజకీయాలు వద్దు

(మొదటి పేజీ తరువాయి)

క్యాపిటల్‌స్‌గా సేవలందిస్తున్నాయ ని, జనాభా నియంత్రణ పాటించినందుకు దక్షిణాది రాష్ట్రాలకు శిక్ష విధిస్తారా? అని సీఎం రేవంత్ రెడ్డి కేంద్రాన్ని నిలదీశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా రిజర్వేషన్ల అంశానికి తమ పూర్తి మద్దతు ఉన్నప్పటికీ, దానిని డీలిమిటేషన్‌తో అనుసంధానం చేయడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉంద ని తీవ్రంగా విమర్శించారు. నిజం గా చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికే ఉన్న లోక్‌సభ, అసెంబ్లీ సీట్లలోనే మహిళలకు కోటా కేటాయించి గత ఎన్ని కల నుంచే అమలు చేయాల్సి ఉం దేదని ఆయన పేర్కొన్నారు. డీలిమిటేషన్ విషయంలో కేవలం జనాభాను మాత్రమే ప్రామాణికం గా తీసుకోవడం అన్యాయమని, రా ష్ట్రాల జీఎస్‌డీపీ, అభివృద్ధి స్థాయి వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దక్షిణాది రాష్ట్రాలు కేంద్ర సూచనల మేరకు కుటుంబ నియంత్రణను సమర్థవంతంగా అమలు చేయడంతో జనాభా నియంత్రణలోకి వచ్చిందని, కానీ ఉత్తరాది రా ష్ట్రాల్లో జనాభా పెరుగుదల ఎక్కువ గా ఉందని గుర్తుచేశారు. ఇప్పుడు జనాభా ఆధారంగా సీట్లను పెంచి తే, బాధ్యతాయుతంగా వ్యవహరించిన దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతిని ధ్యం తగ్గి, ఉత్తరాది ఆధిపత్యం పెరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సమస్య పరిష్కారానికి ‘హైబ్రిడ్ మోడల్’ను ప్రతిపాదిస్తూ, కొత్తగా పెంచే లోక్‌సభ సీట్ల లో సగం జనాభా ప్రాతిపదికన, మిగిలిన సగం రాష్ట్రాల ఆర్థిక వృద్ధి ఆధారంగా కేటాయించాలని సూచించారు. దీని ద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి అధికంగా తోడ్పడుతున్న రాష్ట్రాలకు సరైన రాజకీయ ప్రాతి నిధ్యం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రాంతీయ సమతుల్యత దెబ్బతినకుండా ఉండేందుకు తక్షణమే అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన విధానాన్ని రూపొందించాకే కేంద్రం ముందడుగు వేయాలని సూచించారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకమని బీజేపీ చేస్తున్న ప్ర చారాన్ని ఖండిస్తూ, మహిళలకు ఓటు హక్కు నుంచి చట్టసభల్లో అ వకాశాల వరకూ కల్పించిన చరిత్ర కాంగ్రెస్‌దేనని పేర్కొన్నారు. నిజం గా మహిళల పట్ల గౌరవం ఉంటే 2024 ఎన్నికల నుంచే రిజర్వేషన్లు అమలు చేయాల్సిందని ఆయన నిలదీశారు.

డీలిమిటేషన్ ప్రక్రియను తొందర గా అమలు చేయకుండా, 2026 జనాభా లెక్కల అనంతరం అన్ని వర్గాలతో చర్చించి సమగ్ర నిర్ణ యం తీసుకోవాలని సూచించారు. చిన్న రాష్ట్రాలు, దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడటంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చే స్తూ, ఈ అంశంపై ఇతర రాష్ట్రాల నేతలతో కలిసి పోరాటం కొనసాగిస్తామని రేవంత్ ప్రకటించారు.

## పదేళ్ల విధ్వంసంపై ప్రజలకు వివరణ ఇవ్వాలి

**ముద్ర, నిజామాబాద్:**



రాష్ట్రంలో కేటీఆర్ చేపట్టబోయే పాదయాత్రలో గత పదేళ్ల పాలనలో జరిగిన ఆర్థిక విధ్వంసంపై ప్రజలకు వివరణ ఇవ్వాలని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ నెల 12న మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్ కౌన్సిలర్ల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న కేటీఆర్, గత ప్రభుత్వంలో జరిగిన దోపిడీ, దౌర్జన్యాలను తన వ్యాఖ్యల ద్వారా పరోక్షంగా ఒప్పుకున్నారని ఎద్దేవా చేశారు. సోమవారం నిజామాబాద్ జిల్లాలో ఆయన మీడియాతో మాట్లాడారు. సింగరేణి సంస్థలో ఒప్పందాలు, అక్రమాలు బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే జరిగినవని అన్నారు. విద్యుత్ కొనుగోళ్లలో జరిగిన అవినీతిని ఎంత ప్రయత్నించినా చెరిపివేయలేరని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన దోపిడీని రాష్ట్ర ప్రజలు మర్చిపోలేరని పేర్కొన్నారు. పార్టీ పేరును బీఆర్ఎస్ నుంచి టీఆర్ఎస్‌గా మార్చినంత మాత్రాన ఆ పార్టీ మళ్లీ పుంజుకునే పరిస్థితి లేదని మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. తెలంగాణ గడ్డపై ఆ పార్టీ మళ్లీ మొలకెత్తడం అసాధ్యమన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు పొత్తు పెట్టుకుని కలిసి పోటీ చేసినా అధికారం కాంగ్రెస్ పార్టీదేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి ఎవరూ పోటీ ఇచ్చే స్థితిలో లేరని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

## బీజేపీ ఏ పార్టీతోనూ పొత్తు లేదు

- రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు స్పష్టం

**ముద్ర, నిర్మల్:**

భవిష్యత్తులో బీజేపీ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు స్పష్టం చేశారు. ఖానాపూర్‌లో జరిగిన పొత్తు స్థానిక నాయకుల మధ్య మాత్రమే జరిగిందని, అది పార్టీ స్థాయిలో కాదని ఆయన వివరించారు. ఖానాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు, పోలీసుల బలంతో గుండాయిజానికి పాల్పడ్డప్పటికీ ప్రజలు బీజేపీకి మద్దతు ఇచ్చి పట్టం కట్టారని తెలిపారు. కాంగ్రెస్ అధికార బలం ఖానాపూర్‌లో పనిచేయలేదని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఖానాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయం సాధించడాన్ని పురస్కరించుకుని నిర్మల్‌లో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. ‘వికసిత్ భారత్’ లక్ష్యంతో ఏప్రిల్ 16న మహిళా రిజర్వేషన్‌కు సంబంధించిన ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు.




## సమ్మెపై తొందరొద్దు

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటోన్న సమస్యల్లో రెండు అంశాలపై ప్రభుత్వం కమిటీ వేసిందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కమిటీ నుంచి పూర్తి వివరాలు వచ్చిన తర్వాత కార్మికులకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. సమ్మెకు సిద్ధమవుతున్న ఆర్టీసీ కార్మికులు సోమవారం కార్మిక శాఖ కమిషనర్ తో భేటీకి నిర్ణయించారు. ఈ నేపథ్యంలో మంత్రి కార్మికులకు సూచనలు చేశారు. ఆర్టీసీ విలీనం, యూనియన్ అంశంపై కమిటీ వేసినట్లు తెలిపారు. మిగతా అంశాలు క్లియర్ చేయడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికులు ఆలోచించాలని.. తొందర పడవద్దని ఉద్యోగులకు మంత్రి పొన్నం విజ్ఞప్తి చేశారు. మరోవైపు సమ్మెకు సిద్ధమవుతున్న ఆర్టీసీ కార్మికులు..ప్రభుత్వం తమ డిమాండ్లపై స్పందించకపోతే ఈనెల 20 నుంచి సమ్మెకు వెళ్లాలని యోచిస్తున్నారు. కాగా గత నెల 13న యాజమాన్యానికి ఆర్టీసీ జేఏసీ సమ్మె నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే.

### పోలీసు కస్టడీకి దేవాదాయశాఖ

## అసిస్టెంట్ కమిషనర్ శాంతి

**ముద్ర , అమరావతి**

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతిని న్యాయస్థానం కస్టడీకి పంపుతూ ఆదేశాలు జారీచేసింది. ఆమెను ఈ నెల 15, 16 తేదీల్లో విచారించేందుకు ఏసీబీ కోర్టు అనుమతినిచ్చింది. ప్రస్తుతం ఆమె విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. రెండున్నరేళ్ల కుమారుడు ఉన్నందున ములాఖత్‌కు అనుమతించాలని శాంతి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ పూర్తి చేసిన కోర్టు.. తీర్పును ఏప్రిల్ 16కి వాయిదా వేసింది.ఈ నెల 7న తాడేపల్లి, ఉండవల్లి సహా 4 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టిన అవినీతి నిరోధకశాఖ అధికారులు భారీగా అక్రమ ఆస్తులను గుర్తించారు. విశాఖ ఎండాడలో లగ్జరీ ఫ్లాట్, తాడేపల్లి కుంచనపల్లిలో జీ+2 భవనంతో పాటు 770 గ్రాముల బంగారు నగలు, 3 కిలోల వెండి గుర్తించారు. అంతేకాకుండా రూ.1.15 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో మరో రూ.3 లక్షలు ఉన్నట్లు తేల్చారు. వీటితోపాటు ఓ కారు, ద్విచక్ర వాహనాన్ని గుర్తించిన సంగతి తెలిసిందే.

## టెట్ నోటిఫికేషన్ విడుదల

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలోని నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులకు విద్యాశాఖ శుభవార్త తెలిపింది. రాష్ట్రంలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) నిర్వహణకు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. తాజా షెడ్యూల్ ప్రకారం, ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకు అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఈ ఏడాదిలో ఇది రెండో టెట్ నోటిఫికేషన్ కావడంతో, డీఎస్సీ కోసం సిద్ధమవుతున్న వేలాది మంది అభ్యర్థులకు ఇది మంచి అవకాశంగా మారనుంది. అయితే తక్కువ సమయం ఉన్నందున అభ్యర్థులు అప్రమత్తంగా ఉండి దరఖాస్తు ప్రక్రియను త్వరగా పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం జూన్ నెలలో టెట్ పరీక్షలను నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. పరీక్షా కేంద్రాల ఎంపిక, హాల్ టికెట్ల జారీ, ఇతర సాంకేతిక అంశాలపై విద్యాశాఖ ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. దీంతో అభ్యర్థులు సిలబస్‌ను సరిచూసుకుని జూన్‌లో జరిగే పరీక్షలకు సిద్ధం కావాలని విద్యా నిపుణులు సూచిస్తున్నారు.

**దరఖాస్తు గడువు - ఫీజు వివరాలు**

టెట్ 2026కు అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా మాత్రమే సమర్పించాలి. ఏప్రిల్ 15 నుంచి ఏప్రిల్ 30 వరకు అవకాశం కల్పించారు. ఒక్క పేపర్‌కు బీసీ/ఓసీ అభ్యర్థులకు రూ.750, ఎస్సీ/ఎస్టీ/పిహెచ్ అభ్యర్థులకు రూ.700 చెల్లించాలి. రెండు పేపర్లకు బీసీ/ఓసీ అభ్యర్థులకు రూ.1000, ఎస్సీ/ఎస్టీ/పిహెచ్ అభ్యర్థులకు రూ.950 చెల్లించాల్సి ఉంటుంది. పరీక్షల షెడ్యూల్ అర్హత మార్కులు టెట్ పరీక్షలను జూన్ 15 నుంచి జూన్ 30, 2026 మధ్య కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో నిర్వహించనున్నారు. అభ్యర్థులు జూన్ 9 నుంచి తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలంటే జనరల్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 60 శాతం, బీసీ అభ్యర్థులకు 50 శాతం, ఎస్సీ/ఎస్టీ/పిహెచ్ అభ్యర్థులకు 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ మార్కులు రావాలి. పరీక్షా ఫలితాలను జూలై 28 నుంచి 31 మధ్య విడుదల చేయడానికి విద్యాశాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. పూర్తి వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు కోరుతున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
14.04.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**డాల్ఫిన్లు ప్రమా-దంలో ఉన్న జాతి**

కాలుష్యం, వేట వల్ల సంఖ్య తగ్గుతోంది. గంగా డాల్ఫిన్ వంటి జాతులు ప్రమాదంలో ఉన్నాయి.

# నిద్రమత్తులో రోడ్డు ప్రమాదం

- ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:**



డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకోవడంతో ఓ కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి గాయలయ్యాయి. ఈ సంఘటన సోమవారం తెల్లవారుజామున గద్వాల మండలం వీరాపురం గ్రామ శివారులో చోటు చేసుకుంది. గద్వాల రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్ కర్నూలు జిల్లా పెంట్లవెల్లి మండలం పెంట్లవెల్లి గ్రామానికి చెందిన ఎండి ఇంతియాజ్, ఎండి ఇర్ఫాన్, హాజీ, ముజమిల్ అలీ నలుగురు వ్యక్తులు కలిసి గోవా టూర్ కి వెళ్లారు. గోవా టూర్ ముగించుకొని తిరిగి ప్రయాణంలో గద్వాల మీదుగా పెంట్లవెల్లికి వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో గద్వాల మండలం వీరాపురం గ్రామ శివారులో శ్రీ కృష్ణ స్వామి దేవాలయం సమీపంలో కారు డ్రైవర్ ఎండి ఇర్ఫాన్ నిద్ర మత్తు లోకి జారుకోగా ప్రమాదవశాత్తు కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. డ్రైవర్ పక్కన ముందు సీట్లో కూర్చున్న ఎండీ ఇంతియాజ్ (32)కు తలకు బలమైన రక్త గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ తో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని గద్వాల ఆసుపత్రి కి తరలించగా, ఇంతియాజ్ మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. పోలీసుల కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# విద్యుత్ ఆర్టిజన్ కార్మిక సమస్యలు పరిష్కరించాలి



**స్పీకర్ ప్రసాద్ కుమార్ కు వినతి పత్రం**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

విద్యుత్ ఆర్టిజన్ కార్మిక సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. సోమవారం విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల నిరవధిక సమ్మె ఆరో రోజుకు చేరుకుంది. కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ పి మహేష్, కన్వీనర్ బుచ్చి రెడ్డి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న 19,400 మంది విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు యజమాన్యం, ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. తమ సంస్థలో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులకు మాదిరిగానే తమకు కూడా ఏపీఎస్ఈబి సర్వీస్ రూల్స్ వచ్చేంతవరకు తమ సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. ఆరో రోజులు గడుస్తున్న ఇంకా యజమాన్యం, ప్రభుత్వం స్పందించకపోవడం ఏమిటని వారు ప్రశ్నించారు. చర్చలకు పిలవకుండా యజమాన్యం, ప్రభుత్వం మొండి వైఖరి మానుకోవాలన్నారు. యజమాన్యం ప్రభుత్వం దిగిరాకపోతే సమ్మె ఇంకా సమ్మె ఇంకా ఉద్ధృతం చేస్తామన్నారు. ఇప్పటికైనా యజమాన్యం ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమ్మె ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో విద్యుత్ అంతరాయం తప్పకుండా ఉంటుందన్నారు. 2026 పీఆర్సీ అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు బాల్ రాజు, అక్తర్ అలి, శేఖర్, మెమిన్ , వెంకటయ్య, సతిష్, ఆంజనేయులు, శ్రీశైలం, అమీద్, పరామేష్, సంతోష్. ప్రసాద్, రాజ్ కుమార్, చంద్రశేఖర్ రెడ్డి, సురేష్, విజయ్ వివిధ కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సూక్ష్మ , మైక్రో రంగాలలో మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి



- మహిళలు అన్ని రంగాల్లో రాలించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం
- అధిరి డిజి ప్రెస్ ను ప్రారంభించిన కలెక్టర్ హరిచందన దాసరి

**ముద్ర, హైదరాబాద్:**

జిల్లాలో అర్హులైన మహిళలకు సూక్ష్మ, మైక్రో పారిశ్రామిక యూనిట్లను ఎక్కువగా మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ఆదేశించారు. సోమవారం సికింద్రాబాద్ సీతాఫల్ మండిలో పీఎంఈజీపీ కింద మంజూరైన అధిరి డీజీ ప్రెస్ ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నదే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమన్నారు. సూక్ష్మ, మైక్రో పారిశ్రామిక రంగాలలో మహిళా పారిశ్రామికవేత్తలను ఎక్కువగా ప్రోత్సహించి, అర్హత మేరకు యూనిట్లను గ్రౌండ్లింగ్ చేయాలన్నారు. యూనిట్ల మంజూరులో పారదర్శకత తప్పక పాటించాలని సూచించారు. గత సంవత్సరం వివిధ విభాగాలలో 33 యూనిట్లను అందజేశామన్నారు. పారిశ్రామిక రంగంలో అనుభవం, అర్హత కలిగిన మహిళలు ముందుకు రావాలని కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పవన్ కుమార్, ఎల్డీఎంపీఎన్వీఎల్ మూర్తి, ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులు వల్లాల రేణుక, అరుణ్ కుమార్, బంధుమిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

# అది భర్త రక్తమాంసాలను లాక్కోవడమే..

- భరణం కేసులో మధ్యప్రదేశ్ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు
- లక్ష జీతం ఉన్నా భరణం కావాలా?
- మహిళా పిటిషనర్‌పై కోర్టు ఆగ్రహం
- స్వయం సంపాదన గల మహిళ పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు.

**ముద్ర డెస్క్ :**



మధ్యప్రదేశ్ హైకోర్టు ఇటీవల ఇచ్చిన భరణం కేసు తీర్పు న్యాయ వర్గాల్లోనే కాకుండా సామాజికంగానూ పెద్ద చర్చకు దారితీసింది. ఆర్థికంగా స్వయం సమృద్ధిగా ఉన్న ఒక మహిళ తన భర్త నుంచి భరణం కోరడాన్ని కోర్టు తీవ్రంగా తప్పుబట్టడం ఈ కేసును ప్రత్యేకంగా నిలబెట్టింది.

ఈ కేసు వివరాల్లోకి వెళ్తే, సదరు మహిళ నెలకు లక్ష రూపాయలకు పైగా ఆదాయం పొందుతోంది. అయినప్పటికీ భర్త నుంచి భరణం కావాలని కోరుతూ కోర్టును ఆశ్రయించింది. మొదట ఈ పిటిషన్‌ను ఫ్యామిలీ కోర్టు తిరస్కరించగా, ఆ నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఆమె హైకోర్టుకు వెళ్లింది. అయితే అక్కడ కూడా ఆమెకు ఊరట లభించలేదు. ఈ సందర్భంగా ధర్మాసనం కఠిన వ్యాఖ్యలు చేసింది. "ఇది భర్త రక్తమాంసాలను లాక్కోవడమే" అంటూ మహిళ వైఖరిని తీవ్రంగా విమర్శించింది. ఆర్థికంగా సుస్థిర స్థితిలో ఉన్న వ్యక్తి కేవలం అవతలి వ్యక్తిని ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో ఇలాంటి డిమాండ్లు చేయడం చట్టపరంగా ఆమోదయోగ్యం కాదని కోర్టు స్పష్టం చేసింది.

ఈ తీర్పులో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే, న్యాయమూర్తి విలియం షేక్స్పియర్ రచించిన ది మర్చంట్ ఆఫ్ వెనిస్ నాటకాన్ని ఉదాహరణగా ప్రస్తావించడం. ఆ నాటకంలో షైలాక్ అనే వ్యక్తి అప్పు తిరిగి చెల్లించలేకపోతే ఒక 'పౌండు మాంసం' కోరుతాడు. అదే విధంగా, ఈ కేసులో కూడా అవసరం లేకుండా ఆర్థిక ప్రయోజనం కోసం ఒత్తిడి తేవడం అనేది అన్యాయమని కోర్టు అభిప్రాయపడింది. భరణం చట్టాల అసలు ఉద్దేశం ఏమిటంటే, వివాహ బంధం విచ్ఛిన్నమైనప్పుడు ఆర్థికంగా బలహీనంగా ఉన్న వ్యక్తికి కనీస జీవన భద్రత కల్పించడం. అంటే గౌరవప్రదమైన జీవితం గడపడానికి అవసరమైన సహాయం అందించడమే లక్ష్యం. అయితే, ఈ చట్టాలను కొంతమంది వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉపయోగించడం సరైంది కాదని హైకోర్టు స్పష్టం చేసింది.

భార్యాభర్తలు ఇద్దరూ సమానంగా సంపాదిస్తున్నప్పుడు లేదా ఒకరు స్వయం సంపాదనతో జీవించగలిగే స్థితిలో ఉన్నప్పుడు, అవతలి వ్యక్తిపై ఆధారపడటం చట్టాన్ని దుర్వినియోగం చేయడమేనని కోర్టు పేర్కొంది. పిటిషనర్ ఆదాయం, జీవన విధానం, ఖర్చులను పరిశీలించిన తర్వాత ఆమెకు భర్త నుంచి ఆర్థిక సహాయం అవసరం లేదని కోర్టు తేల్చింది.

ఈ తీర్పు భవిష్యత్తులో ఇలాంటి కేసులకు దిక్సూచిగా నిలుస్తుందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు. చట్టాలను ఆయుధాలుగా మార్చుకుని ఎదుటివారిని వేధించే ధోరణికి ఇది అడ్డుకట్ట వేయగలదని అంటున్నారు. భరణం అనేది బాధితులకు రక్షణ కవచంలా ఉండాలి తప్ప, పగ తీర్చుకునే సాధనంగా మారకూడదని కోర్టు స్పష్టమైన సందేశం ఇచ్చింది.

# నీ చెల్లి ప్రశ్నలకు జవాబు చెప్పు

- ఆ తర్వాతే కేటీఆర్ పాదయాత్ర చేయాలి
- పార్టీ పేరు మార్పు విషయంలో ఆలోచన చేయాలి
- కేటీఆర్ కు మంత్రి అడ్లూరి డిమాండ్

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



తెలంగాణలో ఏం సాధించారని పార్టీ పేరు మార్చుకుని దేశమంతా తిరిగారని గతంలో శాసనమండలి వేదికగా కవిత బీఆర్ఎస్ కు వేసిన ప్రశ్నకు సమాధానం చెప్పిన తర్వాతే కేటీఆర్ పాదయాత్ర, పార్టీ పేరు మార్పు విషయంలో ఆలోచన చేయాలని ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. కేటీఆర్ కు పౌరుషం ఉంటే బీఆర్ఎస్ పాలనలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చర్చకు ముందుకు రావాలని సవాల్ చేశారు. నిరుద్యోగుల ఉసురు తగిలి బీఆర్ఎస్ అధికారం కోల్పోయిందన్నారు. సోమవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. దోచుకో.. దాచుకో అనేది బీఆర్ఎస్ సిద్ధాంతం అని విమర్శించారు. అసూయతోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు, విమర్శలు చేయడం కేటీఆర్ మానుకోవాలని హితవు పలికారు.తెలంగాణలో సొంత రైతులు చనిపోతే పట్టించుకోని కేసీఆర్ ప్రభుత్వం.. పంజాబ్, కర్ణాటక, మహారాష్ట్ర రైతులకు ఇక్కడి నిధులు ఎలా పంపిణీ చేసిందని కవిత చేసిన నిలదీతను మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు.

# జగిత్యాల కాంగ్రెస్‌లో కో ఆప్షన్ వివాదం..

- జెండా మోసిన వారికే కో ఆప్షన్ పదవులు ఇవ్వాలి
- సీనియర్ నాయకుల డిమాండ్
- సీఎం వద్దకు చేరిన పంచాయతీ
- చివరి క్షణంలో ముఖ్యమంత్రి అపాయింట్ మెంట్ రద్దు

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**




జగిత్యాల నియోజకవర్గంలో కొన్ని రోజులుగా నామినేటెడ్ పదవుల కోసం కాంగ్రెస్ నాయకుల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఎప్పటినుంచో కాంగ్రెస్ జెండా మోసిన తమను కాదని, బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికి నామినేటెడ్ పదవులు ఇస్తున్నారని సీనియర్ నాయకులు గుర్రుగా ఉన్నారు. వారు మున్సిపల్ కోఆప్షన్ పదవుల కోసం డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కాని స్పందన రాకపోవడంతో చివరకు జిల్లా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వద్దకు వెళ్లి తమకే నామినేటెడ్ పదవులన్నీ దక్కాలని మొరపెట్టుకున్నారు. కాగా ఈ అంశం తన పరిధిలో లేదని సీఎం స్థాయిలో ఉందని మంత్రి తేల్చి చెప్పారు. కాగా తమకు సీఎం రేవంత్ రెడ్డి తో కలిసే అవకాశం కల్పించాలని సీనియర్ నాయకులు కోరారు. దీంతో మంత్రి సానుకులంగా స్పందించి సోమవారం సాయంత్రం 4 గంటలకు సీఎం అపాయింట్ మెంట్ ఇప్పించారు. సోమవారం ఉదయం ప్రైవేటు బస్సులో సీనియర్లంతా బయలుదేరాల్సి ఉండగా, సీఎం వివిధ కార్యక్రమాల్లో బిజీగా ఉండడం వల్ల అపాయింట్ మెంట్ రద్దు చేసినట్లు సమాచారం రావడంతో ముఖ్యమంత్రిని కలిసే సమావేశం వాయిదా పడింది.

**కావాలనే సీఎం అపాయింట్ మెంట్ రద్దు..?**

జగిత్యాల కాంగ్రెస్ లో వివాదం అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లే క్రమంలో సీనియర్ నాయకులకు సోమవారం ఇచ్చిన సీఎం అపాయింట్ మెంట్ ను హైదరాబాద్ లో ఓ నాయకుడు చక్ర తిప్పడంతో వాయిదా పడినట్లు ప్రచారం జరుగుతుంది. ఇన్నాళ్లు మాజీ మంత్రి జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మధ్య ఆధిపత్య పోరు కారణంగా నామినేటెడ్ పదవులన్నీ వాయిదా పడుతూ వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా జీవన్ రెడ్డి కాంగ్రెస్ కు రాజీనామా చేసి వెళ్లడంతో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కు లైన్ క్లియర్ అయింది. అయితే నామినేటెడ్ పదవులన్నీ చాలా ఏళ్ల నుంచి జెండా మోసిన సీనియర్లైన తమకే దక్కాలని డిమాండ్ పెరగడంతో పాత, కొత్త నాయకుల మధ్య వివాదం తలెత్తింది. ఈ వివాదం ఏ విధంగా సర్దుమనుకుతుందో వేచి చూడాల్సిందే. అయితే సీఎం ఇతర కార్యక్రమాలలో బిజీగా ఉండడం వల్లే వాయిదా పడినట్లు డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య తెలిపారు.

**12 మంది దరఖాస్తుల సమర్పణ..**

జగిత్యాల మున్సిపల్ లో నాలుగు కో ఆప్షన్ పదవుల భర్తీకి ఇటీవలే నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల పదో తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ నెల 16 లేదా 17న ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. కాగా కో ఆప్షన్ పదవుల కోసం 12 మంది దరఖాస్తులు సమర్పించారు. ఇందులో ప్రధానంగా ఇన్నాళ్లు మాజీ మంత్రి జీవన్ రెడ్డి కి ప్రధాన అనుచరులుగా ఉన్న నాయకులు దరఖాస్తు చేయడం విశేషం. అయితే మాజీ మంత్రి జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ ల మధ్య ఉన్న ఆధిపత్య పోరుతోనే కావాలని పెద్ద మొత్తంలో దరఖాస్తు చేశారా? లేక చేయించారా? తెలియడం లేదు. కాంగ్రెస్ లో పాత, కొత్త నాయకుల మధ్య జరుగుతున్న వివాదం ఏ విధంగా పరిష్కారం అవుతుందో వేచి చూడాలి.

# తట్టెపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- ఒకే కుటుంబానికి చెందిన భార్య, భర్త, కూతురు మృతి
- గాయాలతో చికిత్స పొందుతున్న కుమారుడు

**ముద్ర, తాండూర్:**




వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం తట్టేపల్లి గ్రామ సమీపంలో లారీ స్కూటీ ఢీకొని ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో భార్య, భర్త, కూతురు ముగ్గురు స్పాట్లో మృతి చెందగా కుమారుడు గాయాలతో చికిత్స పొందుతున్నాడు. స్థానికులు, పోలీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దముల్ మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన కుటుంబీకులు సోమవారం ఉదయం రుక్మాపూర్ నుంచి కవి రాజు తన భార్య కుమారుడు, కూతురుతో కలిసి స్కూటీపై జహీరాబాద్ కు వెలుతుండగా, మార్గమధ్యంలో తట్టేపల్లి వద్ద జహీరాబాద్ నుంచి ఎదురుగా వస్తున్న లారీ స్కూటీని ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలతో స్పాట్ లోనే భార్య పావని (29) భర్త కవి రాజు (40) కూతురు కీర్తన (11) మృతి చెందారు. కుమారుడు కార్తీక్ మాత్రం గాయాలతో తల్లి శవం వద్ద రోదిస్తున్న తీరు ప్రతి ఒక్కరిని కంటతడి పెట్టించింది. ఘటన స్థలానికి పెద్దముల్ ఎస్సై ప్రశాంత్ వర్ధన్ చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తాండూర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. గాయాలతో ఉన్న బాలుడిని సైతం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.




# భూస్వాధీన ఉద్యమాలకు సిద్ధం కావాలి

- అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ పిలుపు

**ముద్ర, బెంగళూర్:**

భూస్వాధీన ఉద్యమాలకు సిద్ధం కావాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ పిలుపునిచ్చారు. కర్ణాటక రాష్ట్రంలోని గుడిబండలో సోమవారం జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భూ విధానాలపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. భూమి విషయంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య ఎలాంటి తేడా లేదని, రెండూ దొందు దొందే అని ఆయన స్పష్టం చేశారు. అధికారంలోకి రావడానికి ముందు అణగారిన వర్గాలు, పేదల మద్దతు కోరే ఈ పార్టీలు, అధికారంలోకి వచ్చిన తర్వాత భూగద్దలుగా మారి పేదల భూములను కబ్జా చేస్తున్నాయని మండిపడ్డారు. కేరళ ఎన్నికల్లో విలువైన భూములపై కాంగ్రెస్ కన్ను పడిందని, అందుకే రేవంత్ రెడ్డి, డి.కె. శివకుమార్ లాంటి నేతలు పోటాపోటీగా ప్రచారం చేస్తూ కోట్ల రూపాయలు ఖర్చు పెట్టారని విమర్శించారు. అయినప్పటికీ ప్రజలు మూడోసారి ఎల్‌డీఎఫ్‌కు అధికారం ఇస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరుతో లక్షల ఎకరాల భూములను ప్రభుత్వాల అండతో కార్పొరేట్ కంపెనీలు కబ్జా చేస్తున్నాయని, భూముల విషయంలో కేరళ మినహా ఇతర రాష్ట్రాల్లో అన్ని పార్టీల విధానం ఒకటే గుంజుకోవడం, పంచుకోవడం, కంపెనీలలో వాటాలు పొందడమే అని విమర్శించారు. అంతర్జాతీయ అసమానతల నివేదికలు దేశంలో టాప్ 10 శాతం ధనికుల చేతిలో 35 శాతం పైగా భూములు కేంద్రీకృతమై ఉన్నాయని స్పష్టం చేస్తున్నాయని గుర్తుచేశారు. బీజేపీపై విమర్శలు చేసే కాంగ్రెస్, చంద్రబాబు, పవన్ కళ్యాణ్, మమతా వంటి నాయకులు కూడా భూముల దోపిడీలో పోటీ పడుతున్నారని విమర్శించారు. పరిశ్రమల కోసం వంద ఎకరాలు అవసరమైతే వెయ్యి ఎకరాలు కేటాయిస్తూ, అభివృద్ధి పేరుతో భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మార్చేస్తున్నారన్నారు. కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం 2020లో భూ సీలింగ్ చట్టాన్ని సవరించి వ్యవసాయేతరులకు అపరిమితంగా భూములు కొనుగోలు చేసే అవకాశం కల్పించిందని, అదే విధానాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మరింత వేగంగా అమలు చేస్తోందని విమర్శించారు. దేశంలో నిరుద్యోగం పెరగడానికి ప్రధాన కారణం ప్రజల వద్ద కొనుగోలు శక్తి లేకపోవడమేనని, భూములను పేదలకు పంచిపెడితే కొనుగోలు శక్తి పెరిగి ఉపాధి అవకాశాలు కూడా విస్తరిస్తాయని ఆయన స్పష్టం చేశారు. మే నుంచి భూ ఉద్యమాలకు బాటలు - భూమి కోసం, జీవన హక్కుల కోసం సమరశంఖం పూరిస్తామన్నారు. ఈ సభకు నాగరాజు అధ్యక్షత వహించగా పుట్ మధు, డా. అనిల్, మునివెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
14.04.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





డాల్ఫిన్లు మనుషులకు స్నేహపూర్వకంగా ఉంటాయి
చాలా సందర్భాల్లో మనుషులను కాపాడిన ఉదాహరణలు ఉన్నాయి. థెరపీ కార్యక్రమాల్లో కూడా ఉపయోగిస్తారు.




# ముంబైకి బ్యాడ్ న్యూస్

## రోహిత్ శర్మ గాయం.. తదుపరి మ్యాచ్‌కు డౌటే?!



**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్‌లో ముంబై ఇండియన్స్ జట్టుకు ఎదురుదెబ్బ తగిలే సూచనలు కనిపిస్తున్నాయి. జట్టు ఓపెనర్ రోహిత్ శర్మ గాయంతో బాధపడుతుండటంతో తదుపరి మ్యాచ్‌లో అతను ఆడే అవకాశంపై అనిశ్చితి నెలకొంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో రోహిత్ శర్మ బ్యాటింగ్ చేస్తుండగా 19 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద హామ్‌స్ట్రింగ్ సమస్య తలెత్తింది. ఫిజియో సహాయం తీసుకున్నప్పటికీ నొప్పి తగ్గకపోవడంతో రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడాడు. అనంతరం మళ్లీ బ్యాటింగ్‌కు రాలేకపోయాడు. గాయం తీవ్రతను తెలుసుకునేందుకు రోహిత్ శర్మ స్కాన్ చేయించుకోనున్నట్లు సమాచారం. స్కాన్ నివేదిక వచ్చిన తర్వాతే అతను తదుపరి మ్యాచ్‌లో ఆడగలడా లేదా అన్నది తేలే అవకాశం ఉంది. ఇప్పటివరకు ఈ సీజన్‌లో రోహిత్ శర్మ ఒక మ్యాచ్‌లో మాత్రమే అర్ధశతకం నమోదు చేశాడు. కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాణించినప్పటికీ మిగతా మ్యాచ్‌ల్లో ఆశించిన స్థాయిలో ప్రదర్శన చేయలేకపోయాడు. నాలుగు మ్యాచ్‌ల్లో కలిపి 137 పరుగులు సాధించాడు. ఇదిలా ఉండగా ముంబై ఇండియన్స్ జట్టు ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌లు ఆడి ఒకటిలో మాత్రమే విజయం సాధించి, మూడు వరుస ఓటములతో పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానంలో కొనసాగుతోంది. జట్టు తదుపరి మ్యాచ్‌ను ఏప్రిల్ 16న పంజాబ్ కింగ్స్‌తో వాంఖడే స్టేడియంలో ఆడనుంది.

# పాయింట్ల పట్టికలో మార్పులు..

## అజేయంగా రెండు జట్లు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**
ఐపీఎల్ ఈ సీజన్‌లో ఏప్రిల్ 12 వరకు మొత్తం 20 మ్యాచ్‌లు పూర్తయ్యాయి. శని, ఆదివారాల్లో జరిగిన డబుల్ హెడర్ మ్యాచ్‌ల అనంతరం పాయింట్ల పట్టికలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఇప్పటివరకు జరిగిన మ్యాచ్‌ల తర్వాత రెండు జట్లు మాత్రమే ఒక్క పరాజయం లేకుండా అజేయంగా కొనసాగుతున్నాయి. 20 మ్యాచ్‌ల తర్వాత జట్ల స్థానాలు మరింత ఆసక్తికరంగా మారాయి.

**ముంబైపై ఆర్సీబీ ఘన విజయం**
ఆదివారం జరిగిన కీలక పోరులో ఆర్సీబీ జట్టు ముంబై ఇండియన్స్‌పై 18 పరుగుల తేడాతో విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ నిర్ణీత ఓవర్లలో 240 పరుగులు నమోదు చేసింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ 222 పరుగులు చేసినప్పటికీ విజయానికి చేరువ కాలేకపోయింది. ఈ విజయంతో ఆర్సీబీ మరో రెండు పాయింట్లు ఖాతాలో వేసుకుని పాయింట్ల పట్టికలో తన స్థానం బలోపేతం చేసుకుంది.

**అగ్రస్థానంలో రాజస్థాన్.. వెంట పంజాబ్**
పాయింట్ల పట్టికలో రాజస్థాన్ రాయల్స్ అద్భుత ప్రదర్శన కొనసాగిస్తోంది. నాలుగు మ్యాచ్‌లు ఆడిన ఈ జట్టు నాలుగింటిలో విజయం సాధించి ఎనిమిది పాయింట్లతో అగ్రస్థానాన్ని కాపాడుకుంది. మెరుగైన నెట్ రన్‌రేట్ కూడా ఈ జట్టుకు అనుకూలంగా మారింది. పంజాబ్ కింగ్స్ నాలుగు మ్యాచ్‌లలో మూడు విజయాలు సాధించగా, ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కావడంతో మొత్తం ఏడు పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఈ రెండు జట్లు ఇప్పటివరకు పరాజయం రుచి చూడలేదు.

**మూడో స్థానంలో ఆర్సీబీ.. మధ్యలో పోటీ కఠినం**
ఆర్సీబీ నాలుగు మ్యాచ్‌లలో మూడు విజయాలు, ఒక పరాజయంతో ఆరు పాయింట్లు సాధించి మూడో స్థానంలో నిలిచింది. ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్లు నాలుగు మ్యాచ్‌లు ఆడి చెరో రెండు విజయాలు నమోదు చేసి నాలుగు పాయింట్లతో వరుసగా నాలుగు, ఐదు, ఆరు స్థానాల్లో కొనసాగుతున్నాయి. ఈ జట్ల మధ్య పోటీ మరింత ఉత్కంఠగా మారుతోంది.

**చివరి స్థానంలో కోల్‌కతా.. గెలుపు కోసం ఎదురుచూపులు**
సన్‌రైజర్స్ హైదరాబాద్, ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లు నాలుగు మ్యాచ్‌లలో ఒక్కో విజయం సాధించి రెండు పాయింట్లతో ఏడో, ఎనిమిదో, తొమ్మిదో స్థానాల్లో ఉన్నాయి. కోల్‌కతా నైట్ రైడర్స్ మాత్రం నాలుగు మ్యాచ్‌లు ఆడినా ఒక్క విజయాన్ని నమోదు చేయలేక చివరి స్థానంలో నిలిచింది. ఒక మ్యాచ్ వ ర్షం

# బుమ్రా ఫామ్‌పై ఆందోళన..



**ఐదు ఇన్నింగ్స్‌లో ఒక్క వికెట్ తీయని పేసర్**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**
టీమిండియా పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఈ ఐపీఎల్ సీజన్‌లో ఆశించిన స్థాయిలో ణించలేకపోతున్నాడు. ముంబయి ఇండియన్స్ తరఫున ఆడుతున్న అతడు ఇప్పటివరకు ఒక్క వికెట్ కూడా సాధించకపోవడం చర్చనీయాంశంగా మారింది. గత ఐదు ఇన్నింగ్స్‌ల్లో 19 ఓవర్లు బౌలింగ్ చేసి ఒక్క వికెట్ కూడా తీయకుండా 163 పరుగులు సమర్పించాడు. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ ఒకే ఓవర్లో రెండు సిక్సర్లు బాదడం బుమ్రాపై ఒత్తిడిని పెంచింది. అలాగే ఆర్సీబీతో జరిగిన మ్యాచ్‌లో కూడా అతడు ప్రభావం చూపలేకపోయాడు. ప్రత్యర్థి జట్టు భారీ స్కోర్ చేయడాన్ని అడ్డుకోలేకపోయాడు. బుమ్రా తన ప్రధాన ఆయుధమైన యార్కర్లను సమర్థంగా వినియోగించడం లేదని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అతడు త్వరగా ఫామ్‌లోకి రావాల్సిన అవసరం ఉందని మాజీ క్రికెటర్లు సూచిస్తున్నారు.

# ఆటగాళ్లపై కఠిన చర్యలు

## ఐపీఎల్‌లో నిబంధనల ఉల్లంఘనపై జరిమానాలు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఐపీఎల్ 2026 సీజన్‌లో క్రమశిక్షణ విషయంలో కఠిన చర్యలు కొనసాగుతున్నాయి. ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ అనంతరం నిబంధనలు ఉల్లంఘించిన ఆటగాళ్లపై జరిమానాలు విధించారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఆల్‌రౌండర్ టిమ్ డేవిడ్‌కు మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానాతో పాటు ఒక డీమెరిట్ పాయింట్ విధించారు. మ్యాచ్ సమయంలో అంపైర్ సూచనలను పాటించకపోవడం వల్ల ఈ చర్యలు తీసుకున్నారు. మ్యాచ్‌లో 18వ ఓవర్ సమయంలో బంతిని మార్చాలని అంపైర్ సూచించినప్పటికీ టిమ్ డేవిడ్ బంతిని వెంటనే ఇవ్వకపోవడం, 20వ ఓవర్‌లో కూడా ఆలస్యం చేయడం నిబంధనల ఉల్లంఘనగా పరిగణించారు. తన తప్పును టిమ్ డేవిడ్ అంగీకరించి మ్యాచ్ రిఫరీ నిర్ణయాన్ని స్వీకరించారు.అదేవిధంగా ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యాపై స్లో ఓవర్ రేట్ కారణంగా రూ.12 లక్షల జరిమానా విధించారు. ఈ సీజన్‌లో ముంబై జట్టు చేసిన తొలి తప్పిదంగా దీనిని గుర్తించారు. ఇదిలా ఉండగా, ఏప్రిల్ 12న ముంబై వాంఖడే స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు 18 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌పై విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన బెంగళూరు జట్టు 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 240 పరుగులు చేసింది. ఓపెనర్ ఫిలిప్ సాల్ట్ 36 బంతుల్లో 78 పరుగులు చేసి జట్టు విజయానికి కీలకంగా నిలిచాడు. విరాట్ కోహ్లీ అర్ధశతకం నమోదు చేయగా, కెప్టెన్ రజత్ పాటిదార్ 53 పరుగులు చేశారు. లక్ష్య ఛేదనలో ముంబై జట్టు 5 వికెట్లు కోల్పోయి 222 పరుగులకే పరిమితమై వరుసగా మూడో పరాజయాన్ని చవిచూసింది.



# క్రునాల్ పాండ్య బౌలింగ్‌లో కొత్త ప్రయోగాలు



**ఆర్సీబీ విజయాల్లో కీలక పాత్ర**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు మంచి ప్రదర్శన కనబరుస్తోంది. ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌లు ఆడిన ఆర్సీబీ మూడు విజయాలు నమోదు చేసింది. జట్టు విజయాల్లో వెటరన్ స్పిన్ ఆల్‌రౌండర్ క్రునాల్ పాండ్య బౌలింగ్ కీలకంగా మారింది. ముఖ్యంగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అతని ప్రదర్శన ఆకట్టుకుంది. ఆ మ్యాచ్‌లో నాలుగు ఓవర్లు వేసిన క్రునాల్ పాండ్య కేవలం 26 పరుగులు మాత్రమే ఇచ్చి ఒక వికెట్ సాధించాడు. భారీ లక్ష్యాన్ని ఛేదించాల్సిన పరిస్థితిలో అతని కట్టుదిట్టమైన బౌలింగ్ జట్టుకు విజయం అందించడంలో కీలక పాత్ర పోషించింది. స్పిన్ బౌలర్‌గా ఉంటూనే మధ్య మధ్యలో బౌన్సర్ బంతులు విసిరి బ్యాట్స్‌మెన్‌ను ఆశ్చర్యపరుస్తున్నాడు. మ్యాచ్ అనంతరం క్రునాల్ పాండ్య మాట్లాడుతూ తన కెరీర్‌లో ఎప్పుడూ కొత్త ప్రయోగాలు చేయడానికి వెనుకాడలేదని తెలిపారు. ప్రస్తుత క్రికెట్‌లో ఎనిమిదో స్థానంలో వచ్చే బ్యాట్స్‌మెన్ కూడా మొదటి బంతి నుంచే భారీ షాట్లు ఆడుతున్నారని, అందువల్ల బౌలర్‌గా ముందుగానే కొత్త ఆలోచనలతో ఉండాల్సి వస్తుందని చెప్పారు. బౌన్సర్ బంతులు వేయడం కోసం ముందస్తు ప్రణాళిక ఉండదని, మ్యాచ్ పరిస్థితులను బట్టి వాటిని ఉపయోగిస్తానని వివరించారు.ఇదిలా ఉండగా, ఆర్సీబీ జట్టు తన తదుపరి మ్యాచ్‌ను ఏప్రిల్ 15న లక్నో సూపర్ జెయింట్స్‌తో స్వస్థలంలో ఆడనుంది.



# మ్యాచ్ మధ్యలో కోచ్ ఆగ్రహం..

**నెహ్రా ప్రవర్తనపై చర్చ**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**
ఐపీఎల్ 2026లో భాగంగా ఆదివారం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్-గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ సందర్భంగా గుజరాత్ టైటాన్స్ కోచ్ ఆశిష్ నెహ్రా ఆగ్రహానికి లోనైన ఘటన చర్చనీయాంశంగా మారింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ఒక దశలో 157 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. మ్యాచ్‌లో తమ జట్టుకు ఆధిక్యం ఉన్నప్పటికీ గుజరాత్ టైటాన్స్ కోచ్ ఆశిష్ నెహ్రా అసంతృప్తిగా కనిపించాడు. ఫీల్డింగ్‌లో మార్పులు చేయాలనే ఉద్దేశంతో కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్ కుల్వంత్ ఖేజ్రోలియా ద్వారా సూచనలు పంపాడు. ఈ సమయంలో ఆగ్రహంతో కుల్వంత్ ఖేజ్రోలియాను నెట్టినట్లుగా ప్రవర్తించిన దృశ్యాలు కనిపించాయి. అనంతరం కుల్వంత్ గిల్ వద్దకు వెళ్లి సూచనలు అందించాడు. ఆ తర్వాతి బంతికే లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ బ్యాటర్ జార్జి లిండే ఔటయ్యాడు. ఈ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. అయితే నెహ్రా ప్రవర్తించిన తీరుపై కొందరు క్రికెట్ అభిమానులు సోషల్ మీడియా వేదికగా విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. కోచ్ హోదాలో ఉండి ఆగ్రహంతో అలాంటి ప్రవర్తన సరికాదని అభిప్రాయపడుతున్నారు.

# మహిళల టీ20 వరల్డ్ కప్‌కు భారీ ప్రైజ్ మనీ..

**ఐసీసీ ప్రకటన**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**
మహిళల టీ20 ప్రపంచ కప్ 2026 టోర్నీ కోసం అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) రికార్డు స్థాయి ప్రైజ్ మనీని ప్రకటించింది. గత 2024 ఎడిషన్‌తో పోలిస్తే ఈసారి నగదు బహుమతిని దాదాపు 10 శాతం పెంచినట్లు వెల్లడించింది. 2024 ఎడిషన్‌లో మొత్తం 7,958,077 డాలర్లు (రూ.70 కోట్లకు పైగా) ప్రైజ్ మనీగా ఉండగా, 2026 మహిళల టీ20 వరల్డ్ కప్ కోసం మొత్తం ప్రైజ్ పూల్‌ను 8,764,615 డాలర్లు (సుమారు రూ.81 కోట్లు)గా నిర్ణయించినట్లు ఐసీసీ తెలిపింది. టోర్నీలో విజేతగా నిలిచిన జట్టుకు రూ.21.8 కోట్లు, రన్నరప్ జట్టుకు రూ.10 కోట్లు అందించనున్నారు. సెమీఫైనల్లో ఓడిన జట్లకు చెరో రూ.6 కోట్లు ఇవ్వనున్నారు. గ్రూప్ దశలో గెలిచిన ప్రతి మ్యాచ్‌కు జట్లకు రూ.29 లక్షలు చెల్లించనున్నారు. అలాగే టోర్నీలో పాల్గొనే ప్రతి జట్టుకు కనీస హామీగా రూ.2.3 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు. జూన్ 12 నుంచి ప్రారంభమయ్యే ఈ మహిళల టీ20 వరల్డ్ కప్ టోర్నీలో మొత్తం 12 జట్లు పోటీపడనున్నాయి.

ICC

# ఐపీఎల్ షెడ్యూల్లో మార్పులు..

**చెన్నై–గుజరాత్ మ్యాచ్ చిదంబరం స్టేడియంలోకి షిఫ్ట్**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**
ఐపీఎల్ 19వ సీజన్ షెడ్యూల్లో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మార్పులు చేసింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో ఏప్రిల్ 26న జరగాల్సిన గుజరాత్ టైటాన్స్-చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్ వేదికను మార్చినట్లు ప్రకటించింది. అదే రోజు అహ్మదాబాద్ సహా గుజరాత్ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు. మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 26న మధ్యాహ్నం 3:30 గంటలకు అహ్మదాబాద్‌లో మ్యాచ్ జరగాల్సి ఉంది. తాజా మార్పుల ప్రకారం ఇప్పుడు అదే రోజు సాయంత్రం 7:30 గంటలకు చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో మ్యాచ్ నిర్వహించనున్నారు. రివర్స్ ఫిక్చర్ ప్రకారం ఈ రెండు జట్ల మధ్య రెండో మ్యాచ్ మే 21న అహ్మదాబాద్‌లో సాయంత్రం 7:30 గంటలకు జరగనుంది. తొలి దశలో 20 మ్యాచ్‌ల షెడ్యూల్ ప్రకటించిన బీసీసీఐ, ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత మిగతా మ్యాచ్‌ల తేదీల్లో మార్పులు చేసింది. ప్రస్తుత సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ నాలుగు మ్యాచ్‌లు ఆడి రెండు విజయాలు, రెండు పరాజయాలు నమోదు చేసింది. చెన్నై సూపర్ కింగ్స్ నాలుగు మ్యాచ్‌లలో తొలి మూడు మ్యాచ్‌లు ఓడిపోగా, నాలుగో మ్యాచ్‌లో విజయం సాధించింది. రాబోయే మ్యాచ్‌లు ఈ రెండు జట్లకు కీలకంగా మారనున్నాయి.




సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
14.04.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**డాల్ఫిన్లు పర్యావరణ సూచికలు**

డాల్ఫిన్లు ఉన్న చోట నీటి నాణ్యత బాగుంటుంది. వాటి తగ్గుదల పర్యావరణ సమస్యలకు సంకేతం.








## ‘చిరంజీవి’ ఫస్ట్ లుక్ విడుదల..

**కొత్త కాన్సెప్ట్‌తో రాబోతున్న చిత్రం**

**ముద్ర, సినిమా డెస్క్ :**

కికు యనమల, కశిష్ ఖాన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న ‘చిరంజీవి’ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ తాజాగా విడుదలైంది. మెగా బ్రదర్ నాగబాబు చేతుల మీదుగా ఈ పోస్టర్ లాంచ్ చేయగా, చిత్రబృందం ఆయనకు ధన్యవాదాలు తెలిపింది. డెక్ట్రోకార్డియా అనే అరుదైన పరిస్థితి నేపథ్యంలో ఈ చిత్రం రూపొందుతోంది. గుండె కుడి వైపున ఉండే సమస్యతో జీవించే యువకుడి కథను ఆసక్తికరంగా, ప్రేరణాత్మకంగా చూపించనున్నారు. తనికెళ్ల భరణి, ఈశ్వరీ రావు, గోపరాజు రమణ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని సాయి వెంకట్ తెరకెక్కిస్తున్నారు. కికు ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై దీప్తి నడిమింటి నిర్మిస్తున్నారు. వేసవి విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే వెల్లడించనున్నారు.



## ఎస్క్వైర్ కవర్‌పై మెరిసిన రామ్ చరణ్..

ముద్ర, సినిమా డెస్క్ :

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ అంతర్జాతీయ స్థాయిలో మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నారు. ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజైన్ ‘ఎస్క్వైర్ ఇండియా’ కవర్ పేజీపై మెరిసి అభిమానులను ఆనందపరిచారు. భారతీయ సినిమాకు గర్వకారణంగా నిలిచిన నటుడిగా, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన స్టార్‌గా మ్యాగజైన్ ఆయనను ప్రశంసించింది. ఈ కవర్ ఫోటోలో రామ్ చరణ్ సరికొత్త స్టైలిష్ లుక్‌లో కనిపిస్తూ ఆకట్టుకున్నారు. రాయల్, కమాండింగ్ లుక్‌తో ఆయన ఫోటోషూట్ ప్రత్యేకంగా నిలిచింది. ఈ షూట్ కోసం చరణ్ హాంకాంగ్ వెళ్లినట్లు సమాచారం. ఈ ఫోటోషూట్‌లో ఆయన పెట్ డాగ్ ‘రైమ్’ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రస్తుతం బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘పెద్ది’ సినిమాలో నటిస్తున్న చరణ్, ఆ సినిమా కోసం పెంచుకున్న హెయిర్ స్టైల్, గడ్డంతోనే ఈ షూట్‌లో కనిపించారు. దీంతో ‘పెద్ది’లో ఆయన లుక్‌పై అభిమానుల్లో మరింత ఆసక్తి పెరిగింది. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, మెగా అభిమానులు వాటిని పెద్ద ఎత్తున షేర్ చేస్తున్నారు. ఒకవైపు సినిమాలతో బిజీగా ఉంటూనే, మరోవైపు అంతర్జాతీయ బ్రాండ్లకు అంబాసిడర్‌గా ఎదుగుతున్న రామ్ చరణ్ గ్లోబల్ స్థాయిలో తన స్థాయిని మరింత బలపరుచుకుంటున్నారు.

## తమిళ డైరెక్టర్ తో విశ్వక్ సేన్

ముద్ర, సినిమా డెస్క్ :



ఇటీవల వరుస పరాజయాలతో సతమతమవుతున్న మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మంచి కమ్‌బ్యాక్ కోసం ప్రయత్నాలు ప్రారంభించాడు. ఈ ఏడాది ‘ఫంకీ’ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చినా, ఆ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం మిక్స్డ్ టాక్‌కే పరిమితమైంది. దీంతో తదుపరి ప్రాజెక్టులపై మరింత ఫోకస్ పెట్టిన విశ్వక్, ఇప్పుడు తమిళ దర్శకుడు రజత్ రవిశంకర్‌తో చేతులు కలిపాడు. ‘దేవ్’ చిత్రంతో గుర్తింపు పొందిన ఈ దర్శకుడు దాదాపు ఏడు సంవత్సరాల తర్వాత మరో సినిమాతో రాబోతుండటంతో ఆసక్తి పెరిగింది. యువ సుధ ఆర్ట్స్ బ్యానర్‌పై సుధాకర్ మిక్కిలినేని నిర్మిస్తున్న ఈ చిత్రం స్టైలిష్ యాక్షన్ మాస్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనుంది. తాజాగా ఈ మూవీ పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది.ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు కొరటాల శివ క్లాప్ కొట్టగా, శ్యామ్ ప్రసాద్ రెడ్డి కెమెరా ఆన్ చేసి స్క్రిప్ట్‌ను అందించారు. విశ్వక్ సేన్ సమర్పిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

## మరో పాన్ ఇండియా మూవీలో జాన్వీ

**ముద్ర, సినిమా డెస్క్:**

బాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జాన్వీ కపూర్ ఇప్పుడు టాలీవుడ్‌లోనూ అదే జోరును కొనసాగిస్తోంది. యువతరానికి ప్రతినిధిగా నిలుస్తున్న ఈ అందాల భామ, తెలుగు ఇండస్ట్రీలో వరుస అవకాశాలు దక్కించుకుంటూ వేగంగా ఎదుగుతోంది. ఎన్టీఆర్ సరసన వచ్చిన ‘దేవర’ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన జాన్వీ, తన గ్లామర్‌తో పాటు నటనతో కూడా మంచి గుర్తింపు సంపాదించింది. ప్రస్తుతం ఆమె రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సనా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘పెద్ది’ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తూ బిజీగా ఉంది. ఇదే సమయంలో మరో భారీ ప్రాజెక్ట్‌లో కూడా ఆమె పేరు వినిపించడం ఆసక్తికరంగా మారింది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరియు సెన్సేషనల్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో రూపొందుతున్న పాన్ ఇండియా మూవీ ‘రాకా’లో జాన్వీ కీలక పాత్రలో కనిపించబోతుందనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ప్రాజెక్ట్ ఇప్పటికే భారీ అంచనాలు రేపుతుండగా, జాన్వీ చేరికతో మరింత హైప్ పెరిగే అవకాశముంది. దర్శకుడు అట్లీ తన సినిమాల్లో హీరోయిన్లకు కూడా బలమైన పాత్రలు ఇస్తారన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ‘రాకా’ సినిమాలో ఒక్క హీరోయిన్ కాకుండా నలుగురు స్టార్ హీరోయిన్లకు చోటు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మెయిన్ హీరోయిన్‌గా దీపికా పదుకొనే నటిస్తుండగా, మృణాల్ ఠాకూర్, రష్మిక మందన్నతో పాటు జాన్వీ కూడా కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. సాధారణంగా బాలీవుడ్ హీరోయిన్లు టాలీవుడ్‌లో ఒకటి రెండు సినిమాలతోనే పరిమితమవుతారు. కానీ జాన్వీ మాత్రం ఆ ట్రెండ్‌ను బ్రేక్ చేస్తూ, వరుసగా స్టార్ హీరోల సరసన అవకాశాలు అందుకుంటోంది. ఎన్టీఆర్, రామ్ చరణ్, అల్లు అర్జున్ వంటి టాప్ స్టార్స్‌తో ప్రాజెక్ట్స్ దక్కించుకోవడం చూస్తుంటే, ఆమె భవిష్యత్తు టాలీవుడ్‌లో ఎంతో బలంగా ఉండబోతోందని స్పష్టంగా తెలుస్తోంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం, పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్‌తో జాన్వీ కపూర్ స్థాయి మరింత పెరగడం ఖాయం అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



## పాలక్ ఫ్యాన్స్‌కు ట్రీట్..

## ఫొటోషూట్లతో ఆకట్టుకుంటున్న చిన్నది

**ముద్ర, సినిమా డెస్క్ :**

యువ నటి పాలక్ తాజా ఫొటోషూట్లతో అభిమానులకు ప్రత్యేక ట్రీట్ ఇస్తోంది. స్టైలిష్ లుక్స్‌తో వరుసగా ఫొటోలు షేర్ చేస్తూ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారుతోంది. ప్రతి ఫొటోలో కొత్త స్టైల్‌ను చూపిస్తున్న పాలక్, గ్లామర్‌తో పాటు ఎలిగెన్స్‌ను కూడా బ్యాలెన్స్ చేస్తోంది. ఆమె లుక్స్‌కు నెటిజన్ల నుంచి మంచి స్పందన వస్తోంది. సినిమాల్లో అవకాశాలు అందిపుచ్చుకుంటూ ముందుకు సాగుతున్న ఈ బ్యూటీ, సోషల్ మీడియాలోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. ఫొటోషూట్లతోనే కాకుండా తన స్టైల్‌తో కూడా ట్రెండ్ సెట్ చేస్తోంది.



## కుర్రాళ్లకు కునుకులేకుండా చేస్తున్న నికితా శర్మ

**ముద్ర, సినిమా డెస్క్ :**

నటి నికితా శర్మ తన తాజా ఫొటోలతో సోషల్ మీడియాలో హల్‌చల్ సృష్టిస్తోంది. బ్లాక్ ఫ్లోరల్ సారీలో మెరిసిన ఆమె, గ్లామర్‌తో పాటు ఎలిగెన్స్‌ను అద్భుతంగా మేళవిస్తూ ఆకట్టుకుంది. సాఫ్ట్ లైటింగ్‌లో తీసిన ఈ చిత్రాల్లో నికితా స్టైలిష్ పోజ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సింపుల్ లుక్‌లోనే తన అందాన్ని హైలైట్ చేస్తూ నెటిజన్లను కట్టిపడేస్తోంది. టెలివిజన్, సినిమాల్లో అవకాశాలు అందిపుచ్చుకుంటూ ముందుకు సాగుతున్న నికితా, సోషల్ మీడియాలోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. తాజా ఫొటోలతో మరోసారి తన గ్లామర్‌కు అభిమానులను ఫిదా చేసింది.

## తిమ్మరాజుపల్లి టీవీతో కొత్త ప్రతిభకు అవకాశం

**దర్శకుడు వి.మునిరాజు సినిమా విశేషాలు వెల్లడి**

ముద్ర, సినిమా డెస్క్:

కొత్త ప్రతిభను ప్రోత్సహించే ఉద్దేశంతో హీరో కిరణ్ అబ్బవరం తన కేఏ ప్రొడక్షన్స్, సుమైర స్టూడియోస్ బ్యానర్లపై నిర్మిస్తున్న చిత్రం తిమ్మరాజుపల్లి టీవీ ఈ నెల 17న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రంతో సాయి తేజ్, వేద జలంధర్ హీరో, హీరోయిన్‌లుగా పరిచయం అవుతుండగా, వి.మునిరాజు దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు వి.మునిరాజు మాట్లాడుతూ చిన్నప్పటి అనుభవాలు, గ్రామీణ జీవితం, గ్రామాలకు టీవీ వచ్చిన సమయంలో జరిగిన సంఘటనల ఆధారంగా ఈ కథను రూపొందించినట్లు తెలిపారు. రాయలసీమ గ్రామీణ నేపథ్యంతో సాగే ఈ చిత్రం సస్పెన్స్, భావోద్వేగాలతో సాగుతుందని చెప్పారు. సినిమాను సహజ వాతావరణంలో నిజమైన గ్రామ ప్రాంతాల్లో చిత్రీకరించినట్లు తెలిపారు. కొత్త నటీనటులతో రూపొందిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని, ముఖ్యంగా ఈతరం యువతకు పాత కాలపు జీవనశైలిని పరిచయం చేసే ప్రయత్నం చేశామని వివరించారు.చిత్రంలోని ప్రతి పాత్రకు ప్రాధాన్యం ఉంటుందని, నటీనటులు తమ తమ పాత్రల్లో మంచి నటన కనబరిచారని తెలిపారు. చిన్న సినిమాలకు ప్రేక్షకుల ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో ఈ చిత్రం కూడా మంచి గుర్తింపు పొందుతుందనే నమ్మకం వ్యక్తం చేశారు.





## పసిడి కాంతుల్లో మెరుస్తున్న ప్రిషా సింగ్

**ముద్ర, సినిమా డెస్క్ :**

యువ నటి ప్రిషా సింగ్ తాజా ఫొటోలతో సోషల్ మీడియాలో ఆకట్టుకుంటోంది. పసుపు రంగు చీరలో సంప్రదాయ లుక్‌లో కనిపించిన ఆమె, సింపుల్‌గా ఉండి కూడా స్టైలిష్‌గా మెరిసింది. “నఖ్రేన్ సంభాల్ కే... ఆడత్ లగ్ జాతీ హై” అనే క్యాప్షన్‌తో ఈ చిత్రాలను షేర్ చేసిన ప్రిషా, తన లుక్‌తో నెటిజన్ల నుంచి ప్రశంసలు అందుకుంటోంది.హిందీ, తెలుగు చిత్రాల్లో అవకాశాలు అందిపుచ్చుకుంటూ ముందుకు సాగుతున్న ఆమె, ‘గులాబో సితాబో’, ‘స్పై’, ‘బడ్డీ’ వంటి సినిమాలతో గుర్తింపు పొందింది. సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటూ, తన ఫ్యాషన్‌తో ట్రెండ్ సెట్ చేస్తోంది.

## మిస్టికల్ థ్రిల్లర్ జానర్‌లో ‘పోచమ్మ’.. ఆహాలో ట్రైలర్ విడుదల




**ముద్ర, సినిమా డెస్క్ :**

తెలుగు ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఆహా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్న తాజా వెబ్ సిరీస్ ‘పోచమ్మ’ మిస్టికల్ థ్రిల్లర్‌గా ఆకట్టుకోబోతోంది. అంబటి అర్జున్, శ్రీ పూజా రెడ్డి, స్నేహ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్ ఈ నెల 17 నుంచి స్ట్రీమింగ్ కానుంది. గోల్డ్ సబ్‌స్క్రైబర్లకు ముందుగానే వీక్షణ అవకాశం కల్పించనున్నారు. ఇటీవల విడుదలైన ట్రైలర్ ఆసక్తిని పెంచుతోంది. అడవులతో నిండిన ప్రశాంత వాతావరణంలో ఉన్న ఓ ఇంటి చుట్టూ కథ నడుస్తుంది. ఆ ఇంటి ముందు పోచమ్మ తల్లికి గుడి ఉండగా, ఆ ప్రాంతాన్ని దేవత కాపాడుతుందనే నమ్మకంతో కథ ముందుకు సాగుతుంది.గుడిని, విగ్రహాన్ని తొలగించేందుకు ప్రయత్నించిన వారిపై పోచమ్మ తల్లి ఎలా ప్రతీకారం తీర్చుకుంటుందనే అంశాన్ని ట్రైలర్‌లో రోమాంచకంగా చూపించారు. ఇదే సమయంలో ఒక యువ జంట ప్రేమకథ, వారి జీవితంలో ఎదురయ్యే అడ్డంకులను కూడా హైలైట్ చేశారు. డివైన్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కలగలిపిన ఈ సిరీస్ ట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. శ్రుతి నాయుడు నిర్మాణంలో, రమేష్ ఇంద్ర దర్శకత్వంలో రూపొందిన ‘పోచమ్మ’పై ఆసక్తి రోజురోజుకు పెరుగుతోంది.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com